Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం, ఏప్రిల్ 06, 2026 | సంపుటి - 20 | సంచిక 203 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# హార్ముజ్ జలసంధిని తెరవండి

## ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయిన ట్రంప్



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయారు. తాను ఎంతగా హెచ్చరించినా హార్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవక పోవడంతో ట్రంప్ తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. హార్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌పై భీకర దాడులు తప్పవని హెచ్చరించారు. "మంగళవారం పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జి డే. అన్నీ కలిపి ఇరాన్‌లోనే జరుగుతాయి. దీనికేదీ సాటిరాదు. హార్ముజ్ జలసంధిని తెరవండి. లేకుంటే ఇరాన్‌లో కాదు. 2లో



# నన్ను మెడలు పట్టి గెంటేశారు

## పార్టీ మారే ప్రసక్తే లేదు: ఈటల

శామీర్‌పేట : మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. శామీర్‌పేట లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "ఎలాంటి తప్పు చేయకపోయినా మెడలు పట్టి బయటకు గెంటేసిన బిఆర్ఎస్ పార్టీలోకి మళ్లీ వెళ్తున్నానని పిచ్చి ప్రచారాలు చేస్తున్న వారికి చెబుతున్నా.. పార్టీలు మారే పరిస్థితి లేదు. పార్టీలు మారడం అంటే దుస్తులు మార్చినంత సుంభం కాదు" అని అన్నారు. "నన్ను ఎన్నో అవమా నాలకు గురి చేస్తూ రాత్రికి రాత్రే బిఆర్ఎస్ నుంచి బర్తరఫ్ చేశారు. అధికాల బలంతో వ్యక్తిగతంగానూ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. 2లో

### క్రీడా వసతుల కల్పనలో

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ

## ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ లోని గచ్చిబౌలి వేదికగా జరిగిన ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కేవలం అతిథిగా ప్రసంగించడమే కాకుండా, మైదానంలో క్రీడాకారులతో కలిసి కాసేపు ఫుట్‌బాల్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. జాతీయ స్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించడం పట్ల ఆయన హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..' ఈ టోర్నీకి బి.ఎన్.మల్లిక్ పేరు పెట్టడం ఎంతో సంతోషంగా ఉంది.**

హైదరాబాద్ : దేశానికి పోలీస్ స్పైగా మల్లిక్ అందించిన సేవలు వెలకట్టలేనివి. ఒకప్పుడు ఫుట్‌బాల్ క్రీడకు హైదరాబాద్ కేంద్రంగా ఉండేది, ఇక్కడ నుంచి ఎంతోమంది క్రీడాకారులు దేశానికి ప్రాతినిధ్యం వహించారు. దేశంలో యువతకు సరైన క్రీడా వసతులు లేవు. ఒలింపిక్స్ పథకాల గెలుపులో మనకంటే చాలా చిన్న దేశాలు ముందున్నాయి. 140 కోట్ల మంది జనాభా ఉన్న మనం.. ఒలింపిక్స్‌లో ఒక్క గోల్డ్ మెడల్ సాధించలేకపోవడం బాధాకరం. ఇటీవల క్రీడా సదుపాయాల కల్పనపై అధ్యయనానికి దక్షిణ కొరియాలో పర్యటించాం. హైదరాబాద్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. వివిధ క్రీడల్లో ప్రముఖులను స్పోర్ట్స్ వర్సిటీలో భాగస్వాములను చేశాం' అని అన్నారు. 'ఇటీవల బాగా చదువుకునే యువతనే డ్రగ్స్ బారిన పడుతున్నారు. దేశ స్వాతంత్ర్య కోసం ఒకప్పుడు పంజాబ్ వీరులను అందించింది. కానీ, ఇప్పుడు డ్రగ్స్ భారిన పడి జీవితాలు నాశనం చేసుకున్నారు. మరో పంజాబ్ గా తెలంగాణని కానివ్వం. డ్రగ్స్, సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారాయి. వీటిని నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులది. యువత సరైన దిశలో వెళ్లకపోతే భవిష్యత్తులో తీరని నష్టం జరుగుతుంది.

తరువాయి 2లో



# ఆ ఐదు తీర్మానాలు

## పరిష్కరించాల్సిందే

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్

హైదరాబాద్: సింగరేణి సంస్థ గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం అవగాహన లేకపోవటం సిగ్గుచేటని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కార్మికుల మీద ప్రేమతో సంస్థను కాపాడుకుంటూ ముందుకు తీసుకెళ్లాలన్న సోయి ప్రభుత్వానికి లేదన్నారు. పార్టీలు ఏవైనా సరే అందులో ఉండే ట్రేడ్ యూనియన్లు మాత్రం కార్మికుల కోసమే మాట్లాడాలని కవిత హితవుపలికారు. జెండాలన్నీ పక్కన పెట్టి కార్మికుడికి 2లో

### ఐటీ, పారిశ్రామికరంగంలో తెలంగాణ

# అద్భుత ప్రగతి సాధించింది

## తెలంగాణ అభివృద్ధి గాథను గ్లోబల్ వేదికపై పంచుకున్న కేటీఆర్



తెలంగాణ అభివృద్ధి గాథను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్జాతీయ వేదికపై పంచుకున్నారు. అమెరికా న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ 2026లో పాల్గొన్న కేటీఆర్.. తెలంగాణ రాష్ట్ర పురోగతిపై తన అనుభవాలను పంచుకున్నారు.తెలంగాణ పర్యాటకం పోరాటాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు.

హైదరాబాద్ : మాజీ సిఎం కెసిఆర్ నాయకత్వంలో ఆర్థిక వృద్ధిలో దేశానికి తెలంగాణ దిక్సూచి అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కొనియాడారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మ గౌరవం, ఆకాంక్ష అన్నారు. కొలంబియా బిజినెస్ స్కూలులో ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ జరిగింది. ముఖ్య అతిథిగా కెటిఆర్ హాజరయ్యారు. తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాము అవకాశాల కోసం ఎదురు చూడలేదని, అద్భుతమైన పాలసీలు తయారు చేశామని తెలియజేశారు. మౌలిక సదుపాయాలు కల్పించామని, పెట్టుబడి దారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధిని సాధించామని, పదేళ్లలోనే తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతి గర్వకారణమని ప్రశంసించారు. ఐటీ, పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని

తరువాయి 2లో

## ఏ ఎన్నికలు జరిగినా.. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోం

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు 2



### పేదోడికి ఒక న్యాయం,

# పెద్దోడికి ఒక న్యాయమా..?




## మాజీ మంత్రి హరీష్‌రావు

హైదరాబాద్ : పత్రికల్లో వార్తలు వచ్చినా, పేద రైతులు వెళ్లి దరఖాస్తులు ఇచ్చినా హైడ్రా కళ్లు మూసుకుందంటే.. పేదోడికి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయమా..? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ..శని, ఆదివారాలు వస్తే పేదల ఇళ్లు కూలగొట్టే జీవో 99 హైడ్రా.. 7 వేల కోట్ల భూ కుంభకోణాన్ని ఎందుకు ఆపడం లేదు..? అని ప్రశ్నించారు.



### జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన

# గుర్తుకొస్తోంది

## ఏపీ మంత్రుల తీవ్ర విమర్శలు

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోందని పార్థసారథి వ్యాఖ్యానించారు. విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని అన్నారు. మంగళగిరిలో మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ.. తుగ్లక్ పేరు వినడమే తప్ప చూడ లేదని, కానీ జగన్‌ను చూస్తే ఆయనే గుర్తు కొస్తున్నారని చెప్పారు. మూడు రాజధానుల పేరుతో ఆయన మూడు ముక్కలాట ఆడారని పార్థసారథి విమర్శించారు. తాను చెప్పిందే అందరూ వినాలనే ధోరణివల్లే ప్రజలు ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. చంద్రబాబుపై నమ్మకంతోనే రైతులు రాజధానికి భూములు ఇచ్చారని, అలాంటి రైతులను అవమానించిన వైసీపీకి భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

తరువాయి 2లో

### నిర్లక్ష్యం చేస్తే

# కన్నీళ్లే..!



## రెండు రోజుల్లో జిల్లాకు తుంగభద్ర జలాలు

## ఇప్పటికే అడుగుంటిన ఎస్ఎస్ ట్యాంకులు

## నీళ్లున్నప్పుడే నింపుకోవాలి

## లేదంటే తాగునీటి కోసం తల్లడిల్లాల్సిందే

**తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పశ్చిమ పల్లెసీమల దాహం తీర్చే జలజీవనాడి. గేట్ల మరమ్మతుల దృష్ట్యా జనవరి 16న ఎల్లెల్సీకి నీటి విడుదల ఆపేశారు. ఇప్పటికే పలు ఎస్ఎస్ ట్యాంకులు అడుగంటిపోయాయి. దాహం తీర్చుకోవడం కోసం వివిధ పల్లెల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిందెడు నీటి కోసం మండుటెండల్లో వ్యవసాయ బోరుబావుల వద్దకు పరుగులు పెడుతున్నారు. తాగునీటి అవసరాల తీర్చేందుకు జిల్లా అధికారులు ఇచ్చిన ఇండెంట్ మేరకు టీబీపీ డ్యాం నుంచి శుక్రవారం 900 క్యూసెక్కుల మేర నీటిని కాలువకు విడుదల చేశారు. రెండు మూడు రోజుల్లో జిల్లాకు తుంగభద్ర జలాలు చేరే అవకాశం ఉంది. గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ ఇంజనీర్లు పక్కా ప్రణాళికతో ఎస్ఎస్ ట్యాంకులు నింపాలి. నిర్లక్ష్యం చేస్తే గ్రామీణులకు క'న్నీటి' కష్టాలు తప్పవు.**

కర్నూలు : జిల్లాలో 354 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం 33 సీపీడబ్ల్యూఎస్‌లు ఉన్నాయి. వాటి నిర్వహణకు ప్రభుత్వం ప్రతి ఏటా దాదాపుగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తుంది. తాగునీటి సరఫరా కోసం రూ.కోట్లు ప్రజా ధనం వెచ్చిస్తున్నా, నిత్యం కరువుతో తల్లడిల్లే పశ్చి మ పల్లెసీమల్లో తాగునీటి కష్టాలు తీరడం లేదు. ఎల్లెల్సీ కాల్వ, తుంగభద్ర నది ఆధారంగా 33 సమ్మర్ స్టోరేజ్ (ఎస్-ఎస్) ట్యాం కులు నిర్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఎన్టీఆర్ బాధ్యతలు చేపట్టిన తరువాత 1988లో నెదర్లాండ్ అస్యూరెన్స్ ప్రాజెక్టు తరువాయి 2లో

## హోర్ముజ్ జలసంధిని తెరవండి

నరకంలో ఉన్నట్లే, చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి" అంటూ ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాదు.. వర్ణించలేని బూతు పదాల్ని వాడారు. హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందే అని ఇరాన్‌కు ఇప్పటికే ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. తాను చెప్పినట్లు చేయకపోతే ఇరాన్‌లోని బ్రిడ్జిలు, పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. అయితే, ట్రంప్ హెచ్చరికను ఇరాన్ తేలికగా తీసుకుంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. ఇరాన్ కూడా కువైట్, బహ్రెయిన్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తోంది. అలాగే, తమ దేశంలోని పౌర కేంద్రాలపై దాడులు చేస్తే తాము కూడా మరింత బలంగా దాడి చేస్తామని హెచ్చరించింది. ఇంకోవైపు ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ రాజధాని అయిన బీరుట్‌పై దాడులు చేస్తున్నాయి. అలాగే, ఆదివారం అమెరికాకు చెందిన యుద్ధ విమానాన్ని కూల్చివేశామని ఇరాన్ తెలిపింది. సీ-130 అనే రెండు రవాణా విమానాల్ని, రెండు బ్లాక్ హాక్ అనే హెలికాప్టర్లను కూల్చివేసినట్లు తెలిపింది.

## నన్ను మెడలు పట్టి గెంటేశారు

ఇప్పుడేమో ఈటల పార్టీ మారుతున్నారని కరీంనగర్‌లో కొందరు పోస్టర్లు వేయడం, ఆరోపణలు చేయడం నాకు బాధ కలిగిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలు మారే పరిస్థితి రాదు" అని ఈటల పేర్కొన్నారు.

## ఐటీ, పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించింది

ఐటీ ఎగుమతులు రూ.2.72 లక్షల కోట్లకు పెరిగాయని కెటిఆర్ పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగాల సంఖ్య దాదాపు 10 లక్షలకు చేరుకుందని, హైదరాబాద్ గ్లోబల్ ఐటి దిగ్గజాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని అన్నారు. అతిపెద్ద క్యాంపస్ ను అమెజాన్ హైదరాబాద్ లో ఏర్పాటు చేసిందని, ఆవిష్కరణలకు చిరునామాగా తెలంగాణ మారిందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో కేవలం పదేళ్లలోనే దేశానికి మార్గదర్శకంగా నిలిచే స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. వ్యవసాయం, ఐటీ, పరిశ్రమలు, సంక్షేమ రంగాల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను ఆయన వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యాపారం, ఆవిష్కరణలు, భవిష్యత్ విధానాలపై లోతైన చర్చ జరిగిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలు, నిపుణులతో జరిగిన సంభాషణలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి నమూనా అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు పొందడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు.

## జగన్‌ను చూస్తే తుగ్లక్ పాలన గుర్తుకొస్తోంది

మరోవైపు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తెలుగు జాతిపైన, అమరావతిపైన జగన్‌కు ఎందుకంత కక్ష..? అని ప్రశ్నించారు. జగన్ మొదట అమరావతిని రాజధానిగా అంగీకరించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించామని ఆయన చెప్పారు. జగన్‌కు విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి అన్నారు.

## కులాలు, మతాలు, ఉచితాలు!

ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో ఏ నియంత్రణ పాటించనక్కర లేదన్నట్టు ప్రతివారు తమ అభిప్రాయాలను నిష్కర్షగా, నిర్దయగా వెలిబుచ్చుతున్నారు. ఒక వర్గం లేక ఒక మతానికి చెందినవారు వేరే వర్గాల గురించి తమ చిత్తం వచ్చినట్టు మాట్లాడటం సమాజాన్ని మరింత అతలాకుతలం చేయటానికి దోహదపడుతుందేకానీ ఏ మనిషికీ, ఏ వర్గానికీ లాభం చేకూర్చదని అందరూ గుర్తించాలి. కులాలు, మతాలు–చాలా విధాలుగా రిజర్వేషన్ వెసులుబాటుతో ముడిపడి ఉండి, సమాజాన్ని ఇంకా ముక్కలు, ముక్కలుగా విడగొట్టటానికి దారి తీస్తున్నాయి. ఇదే పంథాలో ఎలక్షన్ ప్రసంగాల్లో ఉచితాల ప్రలోభాలు కూడా విమర్శకు గురవుతున్నాయి. అయితే వెనుకబడిన, ముఖ్యంగా ఆర్థికంగా బలహీనమైన వర్గాలు ఈ ఉచితాల ప్రమాణాలను నమ్మి, ఎన్నికల్లో అవినీతిపరులను, నేరస్థులను ఎన్నుకొంటున్నారు. అసలు ఉచితాలు ఇస్తామని రాజకీయ నాయకులు అనటం, అది ప్రజలు నమ్మటం దేనికి సంకేతం? ఇది తెలుసుకోకుంటే ఎవరిని ఎన్నుకోవాలో ప్రజలకు బహుశా అర్థం కాకపోవచ్చు. 1947 ఆగస్టు 15- భారతదేశానికి శతాబ్దాల శృంఖలాలు తెగి స్వాతంత్ర్యం సిద్ధించినరోజు. అంటే 78 ఏండ్ల 7 నెలలు అవుతున్నది ఇప్పటికి. మరి మన పక్కదేశం చైనా గురించి తెలుసుకొంటే భారతీయుల ఆలోచనలు ఎంత వెనుకబడి ఉన్నాయో తెలుస్తుంది. 1912 వరకు రాజవంశాల పాలన, ఆ తర్వాత ఉద్యమ ఫలితంగా స్వతంత్రత పొందినప్పటికీ చైనాకు నిజమైన స్వాతంత్ర్యం 1949 అక్టోబర్ 1న వచ్చినట్టే చరిత్ర చెప్తున్నది. మరి ఒక్క అర్థశతాబ్దం దాటేటప్పటికి విద్యారంగంలో, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చైనా అభివృద్ధి ఎలా ఉండింది, భారతదేశం ఎక్కుడున్నది? ముఖ్యంగా విద్యారంగం ఎందుకు ఇంకా ఎదగలేదు? దీనికి మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ ముఖ్య కారణం అని చెప్పకతప్పటంలేదు. చైనాకు ఒకే మాతృభాష ఉండటం (కొన్ని మాండలికాలు ఉన్నా) చాలా అనుకూలం అయింది. చిన్నచిన్న రాజ్యాలుగా ఉండి, అలాగే విదేశీ దండయాత్రల వరకు సాగిన భారతదేశ ప్రాంతాలు వివిధ భాషలు ఆచార వ్యవహారాలకు, ముఖ్యంగా వివిధ మతాలకు కేంద్రాలయ్యాయి. ఈ వైవిధ్యాన్ని గమనించకుండా, అర్థం చేసుకోకుండా పాశ్చాత్య విధానంతో స్థానిక సంస్కృతిని విస్మరించి విద్యా విధానం సాగటంతో, భారతీయులకు తమ సొంత సంస్కృతి పట్ల అవగాహన లోపించింది. దేశ పౌరుల కన్నా, ప్రాంత, రాష్ట్ర పౌరులమనే భావనే కానీ ఐక్యత, భారతీయత పెరగలేదు. స్వార్థం కోసం రాజకీయ నాయకులు శతృత్వానికి దారితీసే కులాలు, మతాల మధ్య ఇంకా చిచ్చు పెడుతూనే ఉన్నారు. నిజానికి అంబేద్కర్–మహామేధావి. విద్యారంగానికి ఒక ప్రతిపాదన చేశారు. అది రాజ్యాంగంలో పెడుదామని అనుకున్నారు. వెనుకబడిన వారికి తగినంత ధనాన్ని వెచ్చించి, మంచి ఉపాధ్యాయులను నియమించి విడిగా పాఠశాలలు, కళాశాలలు 1వ తరగతి నుంచి రాజకీయ నాయకులయ్యే శిక్షణ వరకు ఏర్పరచి ఒక తరాన్ని అభివృద్ధి చేస్తే అది వారి తర్వాతి తరాలకు ఉపయోగపడుతుందని ఆశించారు. కానీ గాంధీజీ ఆ ప్రతిపాదనకు అడ్డుపడి అటువంటి వేర్పాటు పద్ధతి వద్దే వద్దు అని నిరసన ప్రారంభించారు. ఇంకా ప్రజలకు, రాజకీయ నాయకులకు కూడా కనీస విద్యార్హత ఉండాలన్న అంబేద్కర్ ప్రతిపాదనను గాంధీ, నెహ్రూ ఇద్దరూ తోసిపుచ్చారు. ఓటరుకు కనీస విద్య ఉంటే సొంత ఆలోచన ఉంటుందన్న అంబేద్కర్ వాదనను తోసిపుచ్చారు. అభివృద్ధి చెందిన దేశాల్లో లాగ తప్పనిసరి చదువులు లేకపోవటం, ప్రభుత్వ పాఠశాలలు సరిపోయినంతగా తెరవకుండా, జాతీయ స్థాయిలో ఐఐటీలు, ఐఐఎంలు వంటివి ఇంగ్లిష్ మాధ్యమంలో స్థాపించటంతో అప్పటి వరకు విద్యను పొందిన అగ్రకులాల వారి పిల్లలకే లాభం చేకూరింది. గ్రామీణ బాలబాలికలు, యువత వెనుకబడిపోయారు. ఈ సంస్థల్లో చదువుకున్నవారు చాలామంది తమ సొంత అభివృద్ధి కోసం చదువు కాగానే విదేశాలకు వెళ్లిపోయారు. వారి తెలివి వల్ల ఆయా దేశాలు బాగుపడ్డాయి, మేధో వలస వల్ల భారతదేశం వెనుకబడిపోయింది. దురదృష్టవశాత్తు ధనవంతులు, అగ్రకులాల వారు బ్రిటిష్ వారి పాలనలో ఉద్యోగాలు పొంది నగరాలకు, చిన్న, పెద్ద పట్టణాలకు వలస వెళ్లి స్థిరపడటంతో విద్యావకాశాలు, ఉద్యోగాలు, వారి తర్వాతి తరాలకే దక్కాయి. ప్రభుత్వాలు గ్రామీణరంగ వ్యవసాయాన్ని గాని, ఇతర వృత్తులను గాని బలపర్చకపోవటంతో ఆ ప్రజల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి.

# ఆ ఐదు తీర్మానాలు పరిష్కరించాల్సిందే

మంచి చేయటమే అజెండా కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం ముగింపు సందర్భంగా కవిత మాట్లాడారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..'సింగరేణిపై రేవంత్ సర్కార్‌కు అవగాహన లేదు. నైనీ బ్లాక్‌కు సంబంధించి మన కార్మికులు చేసిన ఆందోళనతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆ బాధ, ఆక్రోశంతోనే సింగరేణిలో 13 వేల మంది కార్మికులు ఎక్కువగా ఉన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రధాని మోదీ లేబర్ కోడ్ పేరుతో నాలుగు నల్ల చట్టాలు తెస్తే.. ఆ చట్టాలను తమ రాష్ట్రంలో అమలు చేసేది లేదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తేల్చి చెప్పారు. అలాంటి నిర్ణయం తీసుకున్న ఆమెకు మనం సెల్యూట్ చేయాల్సిందే. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయటం లేదు. కానీ మన రాష్ట్రం మాత్రం ఈ చట్టాలను అమలు చేయమని చెప్పే విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారు. ఇవాళ్టి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధానంగా ఐదు తీర్మానాలు చేసుకున్నాం. ఈ సమావేశంలో చర్చించి చేసిన తీర్మానాలను లేఖ రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తాం. తెలంగాణకు సింగరేణి ప్రాణపదం. కచ్చితంగా సంస్థను కాపాడుకుంటాం. 70 ఏళ్ల వయసులో మా హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌పై రౌడీ షీట్ పెట్టారు. ఆయన పెద్ద రౌడీ అని ప్రభుత్వం అనుకుంటే మేము చిన్న రౌడీలం. మాతోపాటు ధర్మసమాజ్ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కూడా జత చేరాయి. మా రౌడీల గుంపును తట్టుకోవటం ప్రభుత్వం వల్ల కాదు. ఈ కార్యక్రమాన్ని ఏదో రాజకీయ కార్యక్రమం లాగా కాదు.. సింగరేణి సంస్థను కాపాడుకోవాలనే ఉద్దేశంతో పెట్టాం. మరో 20 రోజుల్లో కొత్త రాజకీయ శక్తిగా వస్తున్నాం. మేము తీర్మానం చేసిన అంశాలకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలి. లేదంటే రాజకీయ పార్టీగా ఏర్పడిన తర్వాత బొగ్గు బాయి బాట పడుతాం. అదే విధంగా సమ్మెకు కూడా వెనుకాడబోం. మాతో, సింగరేణితో పెట్టుకోవద్దు. రాజకీయ పార్టీగా వచ్చిన తర్వాత ప్రజలకు మంచి చేసే కొత్త తరహా రాజకీయాలు ఎలా ఉంటాయో చూపించబోతున్నాం' అని కవిత చెప్పుకొచ్చారు. ఐదు తీర్మానాలు.. కేంద్రం తెచ్చిన నాలుగు నల్ల చట్టాలను అమలు చేసేది లేదని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలి. అసెంబ్లీలో తీర్మానం చేయాలి. మెడికల్ బోర్డును మానవతా దృక్పథంతో ఆలోచించి వెంటనే ఏర్పాటు చేయాలి. పెండింగ్ కేసులు పరిష్కరించాలి. అలియాస్ పేర్ల సమస్యను పరిష్కరించాలి. వీటికి లీగాలిటీ వర్తించదు. పొలిటికల్ విల్ ఉంటే సమస్య పరిష్కరించవచ్చు. సింగరేణి సంస్థ ఆల్ట్ మిన్ కంపెనీతో రూ.2,250 కోట్లతో చేసుకున్న ఒప్పందంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. నైనీ, తాడిచర్ల వంటి బొగ్గు గనులను కొత్తగా వచ్చే గనులనూ సింగరేణి సంస్థనే ఆపరేట్ చేయాలి.

## పేదోడికి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయమా..?

నేను చెరువులను కాపాడుతున్నానని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాదర్‌గుల్ కబ్జాలు కనిపించడం లేదా..? ఆ 373 ఎకరాల్లో 17 ఎకరాల లచ్చమ్మ కుంట 6 ఎకరాల బఫర్ జోన్ ఉంది. ఆ చెరువుకు వచ్చే ఫీడర్ ఛానల్స్ అన్నీ ఈ కంపెనీలు ధ్వంసం చేశాయి. లచ్చమ్మ కుంట నిండితే అక్కడి నుంచి నాన్ చెరువు, మర్రివాని కుంట, రెడ్డి కుంట, సున్నం చెరువు, చివరకు ఇంజాపూర్ మాసం చెరువు వరకు నీళ్లు వెళ్తాయి. ఇంత జరుగుతున్నా హైడ్రా రంగనాథ్ కు ఎందుకు వినిపించడం లేదన్నారు. రేపు ఉదయం కల్లా హైడ్రా రంగనాథ్ అక్కడకు వెళ్లి చర్యలు తీసుకోకపోతే.. ఎమ్మెల్యేలతో కలిసి మా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోనే అక్కడికి వెళ్తాం. అంతేకాకుండా అక్కడ ఉన్న 80 నుంచి 100 ఎకరాల గుట్టలను 12 ఎకరాలు లింగమయ్య గుట్ట మినహా మిగతాదంతా మింగేశారు.తెలంగాణ పర్యాటకం ఇది ముమ్మాటికీ మంత్రి పొంగులేటి కంపెనీయే.. హైదరాబాద్ నడిబొడ్డున ఇంత మైనింగ్ జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు..? ప్రతిపక్షాల మీద సిట్ లు వేసే రేవంత్ రెడ్డి దీనిపై ఎందుకు మాట్లాడరు..? ఈ కంపెనీల కబ్జాల వెనుక సాక్షాత్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. వాళ్లు చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు పెడుతున్నారు. ముందు కోహినూర్ గ్రూప్ అని, తర్వాత శిల్పా ఇన్ఫ్రా, మెగా కంపెనీ అని మార్చి మార్చి బోర్డులు పెడుతున్నారు. కంపెనీస్ యాక్ట్ వెబ్ సైట్ ప్రకారం.. శిల్పా ఇన్ఫ్రా, శిల్పా రాఘవ న్యూ లలో మంత్రి పొంగులేటి కొడుకు హర్షారెడ్డి, లోహిత్ రెడ్డి, స్వప్న రెడ్డి డైరెక్టర్లుగా ఉన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ కు కాంపౌండ్ వాల్ కోసం దరఖాస్తు చేసిన చెందిన క్రిస్టల్ మాన్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో కూడా హర్షారెడ్డి డైరెక్టర్ గా ఉన్నారు. ఇది ముమ్మాటికీ మంత్రి పొంగులేటి కంపెనీయే అని స్పష్టమైంది. రెవెన్యూ మంత్రి కుటుంబ సభ్యులే ఈ కబ్జాల వెనుక ఉన్నప్పుడు ఆర్డీవో, హైడ్రా లాంటి చిన్న అధికారులు వారిని ఎలా అడ్డుకుంటారు.. ? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే తక్షణమే హైడ్రాను పంపించి ఆ అక్రమ కాంపౌండ్ వాల్ ను కూలగొట్టాలి. ఆక్రమించిన వారిని అరెస్ట్ చేసి దొంగలు ఎవరో బయటపెట్టాలి. తాత ముత్తాతల నుంచి వ్యవసాయం చేసుకుంటున్న రైతులను తిరిగి ఆ భూముల్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు.

# నిర్లక్ష్యం చేస్తే కన్నీళ్లే..!

(ఎన్‌ఏపీ) స్కీం కింద కౌతాళం మండలం హాల్వి, ఆదోని మండలం హానవాలు, కోసిగి మండలం సాతనూరు, నందవరం మండలం చిన్నకొత్తిలికి సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) నిర్మించారు. ఇప్పటికే 38 ఏళ్లు గడిచింది. 1991 జూన్ 21న ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పీవీ నరసింహారావు నంద్యాల ఎంపీగా విజయం సాధించారు. cతాగునీటి కోసం 1993లో నంద్యాల వాటర్ సప్లయ్ స్కీం (ఎన్‌డబ్ల్యూఎ?సపీ) కింద రూ.100 కోట్లు మంజూరు చేశారు. ఈ స్కీం కింద బండగట్టు (పత్తికొండ), గోనేగండ్ల, పెద్దకడబూరు, హోళగుంద మండలం హె బ్బటం, నందవరం మండలం నాగులదిన్నె, హాలహర్వి, చిప్పగిరి మండలం ఖాజీపురం వంటి సీపీడబ్ల్యూఎస్ స్కీంలు నిర్మించారు. ఇప్పటికే 33 ఏళ్లు దాటింది. అయితే 30 ఏళ్ల జనాభాకు అనుగుణంగా అప్పట్లో డిజైన్ చేశారు. కాలపరమితి తీరడం, మరో పక్క జనాభా పెరగడంతో పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితి ఉందని ఇంజనీర్లే అంటున్నారు. తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతుల కారణంగా జనవరి 16న ఎల్లెల్సీ కాలువకు నీటి సరఫరా ఆపేశారు. వేసవి తాగునీటి ఇబ్బందుల దృష్ట్యా ఎస్ఎస్ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని జలవనరుల శాఖ ఇంజనీర్లు ముందే హెచ్చరికలు జారీ చేసినా, జనాభాకు సరిపడా నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఎస్ఎస్ ట్యాంకులు లేకపోవడం శాపంగా మారింది.

నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవు.. ఎల్లెల్సీ ఆధారంగా ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో 195 గ్రామాలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. సమ్మతగేరి, ఎల్లార్తి, విరుపాపురం, నాగనాథనహల్లి.. వంటి ఎస్ఎస్ ట్యాంకులు దాదాపుగా ఎండిపోయాయి. మిగిలిన ఎస్ఎస్ ట్యాంకుల్లో 15–25 రోజులకు సరిపడా నీరు కూడా లేవు. తాగునీటి అవసరాల కోసం మార్చి 20న ఎల్లెల్సీ నీటిని విడుదల చేయాలని టీబీపీ బోర్డుకు జిల్లా అధికారులు ఇండెంట్ ఇచ్చినా నీటి విడుదల కాలేదు. పది రోజుల వరకు రోజుకు 900 క్యూసెక్కుల చొప్పున తాగునీరు ఇవ్వాలని మరోసారి ఇండెంట్ పంపారు. శుక్రవారం తుంగభద్ర డ్యాం నుంచి నీటిని విడుదల చేశారు. రెండు మూడు రోజుల్లో జిల్లాకు నీరు చేరే అవకాశం ఉంది. వచ్చిన నీటిని వృథా చేయకుండా ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరుల శాఖ ఇంజనీర్లు సమన్వయంతో తక్షణమే ఎస్ఎస్ ట్యాంకులు నింపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏప్రిల్, మే, జూన్ ఆఖరు వరకు తాగునీటికి డిమాండ్ ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా దాహం తీర్చుకోవడానికి గ్రామీణ ప్రజలు తీవ్ర కష్టాలు పడాల్సి వస్తుంది. పుష్కలంగా నీళ్లు ఉన్నా.. తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువకు 24 టీఎంసీలు నీటివాటా ఉంది. 2025–26 నీటి సంవత్సరంలో ఎల్లెల్సీ కోటాగా 20.08 టీఎంసీలు కేటాయించారు. అందులో 14.288 టీఎంసీలు వినియోగించుకోగా, 5.80 టీఎంసీలు మిగుల వాటా ఉంది. రోజుకు 900 క్యూసెక్కులు చొప్పున ఇండెంట్ తీసుకుంటే నెలకు సరాసరి 2.33 టీఎంసీలు కావాలి. డ్యాంలో 5.80 టీఎంసీలు మిగులు వాటా ఉంది. అంటే.. జూన్ 15–20 వరకు నిరంతరాయంగా నీటిని తీసుకునే అవకాశం ఉంది. డ్యాం గేట్లు మరమ్మతుల దృష్ట్యా నిరంతరాయంగా నీటిని ఇవ్వలేమని, ఒక దఫా మాత్రమే విడుదల చేస్తామని టీబీపీ బోర్డు అధికారులు తేల్చి చెప్పినట్లు సమాచారం. డ్యాంలో నీటి వాటా పుష్కలంగా ఉన్నా, గేట్ల మరమ్మతుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళిక, సమన్వయంతో చుక్కనీరు కూడా వృథా చేయకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే క్రమంలో జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తుంగభద్ర డ్యాం నుంచి పూర్తివాటా నీటిని తీసుకునేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. మున్సిపాలిటీల్లో ఇది పరిస్థితి.. ఆదోని పట్టణ జనాభా 2.60 లక్షలు. ప్రధాన తాగునీటి ఆధారం ఎల్లెల్సీ కాలువ. రోజుకు 26 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) సరఫరా చేయాల్సి ఉంటే 24 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా చేస్తున్నారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు 3,110 మిలియన్ లీటర్లు (120 రోజులకు సరిపడా) సామర్థ్యంతో బస్సాపురం ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించారు. డిజైన్ లోపమో, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు విస్మరించారో..? ఇంజనీర్లకే తెలియాలి. అప్పుడే ఎస్ఎస్ ట్యాంక్ కట్ట కుంగిపోయింది. ఇసుక సంచులు అడ్డంగా వేసి 700–800 మిలియన్ లీటర్లు (ఎంఎల్) నింపుతున్నారు. అంటే.. నెల రోజులకు మించి సరిపోవడం లేదు. ఎమ్మిగనూరు పట్టణ జనాభా 1.20 లక్షల జనాభా ఉంది. తాగునీటి అవసరాలకు ఎల్లెల్సీ కాలువే ఆధారం. రోజుకు 14 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేయాల్సి ఉంటే 10.45 ఎంఎల్‌డీ సరఫరా చేస్తున్నారు. పట్టణ జనాభా నీటి అవసరాలు తీర్చే నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఎస్ఎస్ ట్యాంక్ లేదు. దీంతో గుడేకల్లు చెరువు ఆధారపడాల్సి వస్తుంది. పులికనుమ రిజర్వాయన్ నుంచి నీటిని తీసుకున్నా, ప్రస్తుతం 25–30 రోజులకు మించి నీటి నిల్వలు లేవు. దీంతో ఎల్లెల్సీపైనే ఆధార పడాల్సి వస్తుంది. ఆదోని, ఎమ్మిగనూరు పట్టణ ప్రజల అవసరాలు దృష్ట్యా మే ఆఖరు వరకు ఎల్లెల్సీ ద్వారా నీటిని తీసుకుంటే జూన్ ఆఖరకు వరకు తాగునీటి కష్టాలు లేకుండా నీటిని సరఫరా చేసి ఈ వేసవిని గట్టెకించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఎల్లంపల్లి వేరు కాదు.. కాళేశ్వరంలో భాగమే

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నపూర్ణ, రంగానాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, బస్వాపూర్ జలాశయాల నుంచి విడుదలయ్యే నీళ్లు కాళేశ్వరం నీళ్లు కావు..అవి ఎల్లంపల్లి ప్రాజెక్టు నీళ్లు అనేది ఒక దుష్ప్రచారం మాత్రమే. ఈ ప్రశ్న ఇప్పటిది కాదు..పాతదే. కాళేశ్వరం ప్రాజెక్టు అందిస్తున్న ఫలితాలను గుర్తించడం ఇష్టంలేక చేస్తున్న కువిమర్శలు తప్ప వేరు కాదు. ఈ కువిమర్శలకు గతంలోనే అనేకసార్లు వివరణలు ఇచ్చి ఉన్నాను. అయినా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మళ్లీ మళ్లీ అటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తూనే ఉన్నారు. ఈ ప్రాజెక్టుపై విమర్శకులు మళ్లీ ఈ చర్చను లేవనెత్తినందున వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయి? మహారాష్ట్రలో ఎగువ గోదావరి సబ్ బేసిన్‌లో నిర్మించిన జైక్వాడి డ్యామ్ నుంచి వస్తాయి. మరి మనం ఎందుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్లు అంటాం? జైక్వాడి డ్యామ్ నీళ్లు అనొచ్చుకదా! అట్లా ఎందుకు అనం అంటే.. ఆ ప్రాజెక్టు పరిధి దాటి, నదిపై మరో ప్రాజెక్టు కట్టినప్పుడు, ఆ ప్రాజెక్టుకు ఒక పేరు పెట్టుకుంటాం కనుక అక్కడ నుంచి సరఫరా అయ్యే నీటిని ఆ ప్రాజెక్టు పేరుతోనే పిలుస్తాం. ఇదే సూత్రం కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా వర్తిస్తుంది. అన్నపూర్ణ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించినవే. ఎల్లంపల్లి, మిడ్‌మానేరు జలాశయాలు వేరుగా నిర్మించిన జలాశయాలు అయినప్పటికీ అవి కాళేశ్వరం వ్యవస్థలో విడదీయరాని భాగంగా మారాయి. ఈ రెండూ కూడా కాళేశ్వరం వ్యవస్థలో కీలకమైన బ్యాలెన్సింగ్ జలాశయాలుగా మారిపోయిన సంగతి ప్రాజెక్టు విమర్శకులు గురించకపోవడం శోచనీయం. కాళేశ్వరం కాకుండా ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించినా ఎల్లంపల్లి, మిడ్‌మానేరు జలాశయాలు ఆ ప్రాజెక్టులో భాగం అయ్యేవి కావా? అప్పుడు కూడా ఈ విమర్శకులు ఆ నీళ్లను ఎల్లంపల్లి నీళ్లు అనేవారా? లేక ప్రాణహిత–చేవెళ్ల నీళ్లు అనేవారా? జలసంఘం కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి లభ్యత 240 టీఎంసీలుగా పేర్కొన్నది. ఇందులో గోదావరి నుంచి ఎత్తిపోసుకొనే నీరు 195 టీఎంసీలు, ఎల్లంపల్లి ప్రాజెక్టులో లభ్యమయ్యే నీరు 20 టీఎంసీలు, ఆన్‌లైన్ చెరువుల పరీవాహక ప్రాంత నీటి లభ్యత 10 టీఎంసీలు, ఆయకట్టు ప్రాంతంలో లభ్యమయ్యే భూగర్భ జలాలు 25 టీఎంసీలు, మొత్తం 250 టీఎంసీలు. ఆవిరి నష్టాలు 10 టీఎంసీలు తీసివేస్తే నికరంగా లభ్యమయ్యే నీరు 240 టీఎంసీలు. ఇందులో నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతిపాదించిన నీటి వినియోగం ఇలా ఉన్నది. కొత్త ఆయకట్టుకు (18.25 లక్షల ఎకరాలు) సాగునీరు–134.5 టీఎంసీలు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు, వరద కాలువ, ఆయకట్టు స్థిరీకరణ (18.82 లక్షల ఎకరాల్లో మొత్తంగా 25% నీటి కొరతను పరిగణించి)–34.5 టీఎంసీలు, హైదరాబాద్ నగరానికి నీటి సరఫరా30 టీఎంసీలు, దారిపొడుగునా గ్రామాలకు తాగునీరు10 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు16 టీఎంసీలు, ఆవిరి నష్టాలు12 టీఎంసీలు, మొత్తం 237 టీఎంసీలు. ఈ వాస్తవాలను గమనిస్తే..ఎల్లంపల్లి వద్ద లభ్యమయ్యే 20 టీఎంసీల నీరు కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమేనని తెలిసిపోతుంది. కేంద్ర జలసంఘం ఆమోదించిన ఈ గణాంకాలను చూసిన తర్వాత కూడా వీరి కండ్లు తెరుచుకోకపోతే ఇక ఎవరైనా చేసేదేమీ ఉండదు. వారి అజ్ఞానానికి చింతించడం తప్ప. ఇకపోతే..ముందు వివరించిన విధంగా నదిపై ఒక ప్రాజెక్టు పరిధి దాటి మరో ప్రాజెక్టు కట్టినప్పుడు కచ్చితంగా కొత్తగా కట్టిన ప్రాజెక్టు పేరుతోనే పిలుస్తాం. కనుక కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన రిజర్వాయర్ల నుంచి విడుదలయ్యే నీళ్లను కాళేశ్వరం నీళ్లు అనే అంటాం తప్ప ఎల్లంపల్లి నీళ్లు అనడానికి లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి సరఫరా అనేది మూడు విధాలుగా జరుగుతుంది. ఈ అంశాన్ని కూడా గతంలో అనేకసార్లు వివరించాం. మొదటిది శ్రీరాంసాగర్‌కు వరద వచ్చినప్పుడు వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు, కాకతీయ కాలువ ద్వారా దిగువ మానేరు చేరతాయి. ఇవి పోగా ఇంకా వరద ఉంటే గేట్ల ద్వారా నదిలోకి వదులుతారు. అవి ఎల్లంపల్లికి వెళ్తాయి. ఎల్లంపల్లి నిండితే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డకు వెళ్తాయి. ఆ తర్వాత తుపాకులగూడెం ద్వారా పోలవరానికి వెళ్తాయి. శ్రీరాంసాగర్‌కు కనీసం మూడేండ్లకు ఒకసారైనా వరద వచ్చే అవకాశం ఉన్నదని గత 25 ఏండ్ల వరద చరిత్ర చూస్తే తెలుస్తున్నది. శ్రీరాంసాగర్‌కు వరద వచ్చిన స్థితిలో కాళేశ్వరం లింక్–1 పంపులు (మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి), లింక్–2 పంపులు (ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు) తిప్పే అవసరం రాదు.

## క్రీడా వసతుల కల్పనలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ

యువతకు మార్గ నిర్దేశం చేయాలని హైదరాబాద్‌కు ప్రముఖ ఫుట్‌బాల్ ప్లేయర్ మెస్సీని తీసుకువచ్చాను. బాక్సింగ్ ఛాంపియన్ నిక్కత్ జరీన్‌కు గ్రూప్ 1 ఉద్యోగంతో పాటు 2 కోట్ల నగదు పురస్కారం అందించాం. క్రికెటర్ సిరాజ్ కు గ్రూప్ 1 ఉద్యోగం డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. పారా ఒలింపిక్స్‌లో రాణించిన దీప్తి జురాంజి కి గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చాం. క్రీడల్లో రాణించే తెలంగాణ యువతకు ఉద్యోగాలు తప్పకుండా ఉద్యోగాలు వస్తాయి' అని అన్నారు.

## ఏ ఎన్నికలు జరిగినా.. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోం

జనగామ, ఏప్రిల్ 05: రాష్ట్రంలో ఏ ఎన్నికల్లో జరిగిన బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఏ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకోదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఆదివారం జనగామలో టీ బీజేపీ చీఫ్ ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో అన్ని విధాల ఈ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వెళ్లి తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రమే నగదు ఇస్తుందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి పేరుకు పోయిందంటూ ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణలో ఎవ్వరు కూడా తృప్తిగా లేరన్నారు. ప్రపంచంలో అన్ని దేశాల ప్రజలు యుద్ధాలతో ఇబ్బంది పడుతున్నారు కానీ.. దేశంలో మోదీ నాయకత్వంలో మాత్రం ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారని పేర్కొన్నారు. దేశంలో ఏ కొరత లేకున్నా గ్యాస్, పెట్రోల్ కొరత ఉందంటూ ఫేక్ ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్‌పై ఎన్ రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో లాక్ డ్రైన్లు, బ్రేక్ డౌన్లు ఉండవని ఎన్ రాంచందర్ రావు తెలిపారు.

## మేల్కొందాం.. ప్రశ్నిద్దాం.. పోరాడుదాం

కాళేశ్వరం ప్రాజెక్టు సాధించిన పురోగతి కండ్ల ముందు కనిపిస్తున్నా.. కుట్రపూరితంగా, రాజకీయ స్వార్థంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు కట్టగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు. పార్లమెంటులో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అడ్డగోలుగా మాట్లాడారు. ఇదంతా చూస్తుంటే తెలంగాణ రైతు బిడ్డల రక్తం మరుగుతున్నది. అరవై ఏండ్లపాటు తెలంగాణను నిర్లక్ష్యం చేసిన పార్టీల నేతలు, బాగు చేసినోళ్లను చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారు. శత్రువు కుట్రకు కొందరు తెలంగాణకు చెందిన ఇంటి దొంగలే ఆజ్యం పోస్తున్న వైనం అర్థం చేసుకోవాలి? ప్రజలను వంచించి, అధికారాన్ని చేతబట్టి, రాష్ట్ర సంపదను లూటీ చేస్తున్న మోసగాళ్లు అజ్ఞానంతో వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ నాయకత్వంలో అద్భుతంగా నిర్మితమైన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందంటూ కాంగ్రెస్, బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. రెండున్నరేండ్ల కింద ఇదే తప్పుడు మాటలతో ప్రజలను తప్పుదోవపట్టించారు. రెండు పార్టీల లోపాయికారి ఒప్పందంలో కాంగ్రెస్ గద్దెనెక్కింది. బృహత్తరమైన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు కూలిపోయిందనే ప్రచారం చేశాయి తెలంగాణ వ్యతిరేకశక్తులు. తెలంగాణ వాటర్ హబ్‌గా మారడం, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఘనంగా పుంజుకోవడం వెనుక కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నది. తెలంగాణ పల్లెలు నేడు ప్రగతి కేంద్రాలుగా పురోగతి సాధించడానికి కాళేశ్వరం ప్రాజెక్టు కారణం. రాష్ట్ర తలసరి ఆదాయం, స్టేట్ ఓన్ రెవెన్యూ పెరగడంలో కాళేశ్వరం ప్రాజెక్టు అందించిన ఫలాలు ఉన్నాయి. మొత్తంగా రాష్ట్ర అభివృద్ధికి రైతు ప్రగతి కారణమైతే, రైతు ప్రగతికి కాళేశ్వరం కారణం. ఈ వాస్తవాన్ని కొందరు వక్రీకరిస్తుంటే కొందరు ఎందుకు స్పందించడంలేదు? ఇవాళ గల్లీ నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్, బీజేపీ నేతలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి కేసీఆర్ పాలనను బద్నాం చేస్తుంటే.. కొందరికి చీమ కుట్టినట్టైనా ఎందుకు అనిపించడం లేదు? కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారానికి ఇప్పటికే మోసపోయిన సంగతైతే అర్థం కావాలి కదా! మరెందుకు నోర్లు మూతపడుతున్నాయి? పౌర సమాజం స్పృహ కోల్పోయి, నోరు మూసుకొని ఉంటే ఎవరికి నష్టం? ప్రభుత్వాలు చేస్తున్న తప్పులను నిలువరించడం ప్రతి ఒక్కరి బాధ్యత కదా! సంస్థలు, సంఘాలు, వ్యక్తులు, మేధావులుగా ఎవరికి వారుగా అన్యాయాలు, అప్రజాస్వామిక విధానాలు, పాలకుల దోపిడీపై పోరాడాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బాధితులు పోరాడుతున్నారు.. సత్ఫలితాలు సాధిస్తున్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు రైతులు, రైతు బిడ్డలు, తెలంగాణవాదులు ఐక్యంగా గళమెత్తాలి. కేసీఆర్‌కు వంకలు పెట్టుకుంటూ పబ్బం గడుపుతున్న కొందరు మేధావులు ఇప్పటికైనా సోయి తెచ్చుకోవాలి. మేడిగడ్డలో రెండు పిల్లర్లు బాగుచేయదానికి మేస్త్రీలు దొరకట్లేదా? సిమెంట్ దొరుకుతలేదా? అని కొందరు రైతులు నిలదీస్తున్న వీడియోలు సోషల్‌మీడియాలో కనిపిస్తున్నాయి. సామాన్య రైతులకు వచ్చిన సందేహం మేధావులు అని చెప్పుకొనే వాళ్లకు ఎందుకు రావడంలేదో! తెచ్చుకున్న తెలంగాణను నిలబెట్టుకోవడంలో కూడా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. ఇది ఆలోచించాల్సిన అవసరమున్నది. తెలంగాణ సమాజం అట్లా ఘాటుగా స్పందిస్తేనే కాంగ్రెస్ పాలకులు దుష్ప్రచారం చేసి తప్పించుకోలేరు.

# మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

### బస్టాండ్ సమీపంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకుని వెళ్లాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఆదివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు, తో కలిసి పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలో గల డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి, సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నత జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆయన జీవితంలో అంటరానితనం పరిస్థితుల నుంచి ఉప ప్రధాని పదవి వరకు అనేక అంశాలను చూశారని కలెక్టర్ తెలిపారు. చిన్నతనంలో పాఠశాలలో అంటరానితనం సమస్యతో అనేక బాధలు అనుభవించారని, 29 ఏళ్ళ వయస్సులో శాసన మండలి సభ్యునిగా, 1937 లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి బీహార్ అసెంబ్లీకి ఎన్నికయ్యారని తెలిపారు. 1946లో తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రి గా పని చేశారని, స్వాతంత్ర్య వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంలో 30 సంవత్సరాల పాటు వివిధ మంత్రిత్వ శాఖలలో పని చేశారని తెలిపారు.

అదనపు కలెక్టర్ డి.వేణు : జీవితాన్ని దేశానికి అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని అదనపు కలెక్టర్ డి. వేణు కొనియాడారు. చిన్న తనం నుంచే అంటరానితనం వ్యతిరేకంగా పోరాటం చేశారని, అతి చిన్న వయస్సులో కేంద్ర మంత్రి గా పని చేశారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో పెద్ద ఎత్తున పాల్గొని జైళ్ళు జీవితాన్ని గడిపారని అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 1946లో తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారని, అతి చిన్నవారైనందున బేబీ మినిస్టర్ గా పిలవబడే వారని, రాజకీయాల్లో అత్యుత్తమ పార్లమెంటేరియన్ గా, సుదీర్ఘ కాలం రాజకీయ జీవితాన్ని గడిపిన వ్యక్తి అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, రాజకీయ రంగంలో, సామాజిక వేత్త గా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ప్రత్యేక ముద్ర వేశారని అన్నారు. చిన్న వయస్సు నుంచి విద్య పై శ్రద్ధ వహించి ఆ కాలంలో బీఎస్సీ పట్టా సాధించారని, 30 సంవత్సరాల పాటు వివిధ శాఖల మంత్రిగా కృషి చేసి దేశానికి సేవ చేశారని కొనియాడారు. 1971 యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రి గా పని చేశారని తెలిపారు. మన రాజ్యాంగం కల్పించిన అవకాశం మేరకే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నిరుపేదల ఆకలి తీర్చేందుకు వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవాన్ని ప్రోత్సహించా రని, అన్ని వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారని తెలిపారు. రాజ్యాంగ సవరణ లో అణగారిన వర్గాలకు న్యాయం చేస్తూ అనేక మార్పులను జగ్జీవన్ రావ్ తీసుకొని వచ్చారని ఆయన తెలిపారు. జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో మనమంతా సమాజానికి సేవ చేస్తూ మంచి పేరు తీసుకుని రావాలని, కాలం, ప్రాణం పోతే మళ్ళీ తిరిగి రావని, వీటిని సద్వినియోగం చేసుకుంటే దారిద్రంలో ఉన్నవారు సైతం ధనవంతులుగా ఆవిర్భవించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్, వివిధ ఎస్సీ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక..



బ్యూరో(ది క్రైమ్ న్యూస్) : గ్రేటర్ విద్యానగర్ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. విద్యానగర్ విజ్ఞాన్ స్కూల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ఎన్నికలు మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు బోనాల నర్సయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీలో పలువురిని ముఖ్య సలహాదారులుగా మాజీ కార్పొరేటర్ కొండపల్లి సతీష్, ర్యాకం సుధాకర్,పోరెడ్డి నరేందర్ రెడ్డి, ఉప్పు శ్రీనివాస్,తోట సునీల్,శ్రీరామ్ గంగారెడ్డి,పెద్దపల్లి లక్ష్మణ్ లను నియమించారు.గౌరవ అధ్యక్ష, ముఖ్య సలహాదారుల నిర్వహణలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. అధ్యక్షునిగా ఉప్పు తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా బట్టు సుధాకర్, కోశాధికారిగా ఐల రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా గూడ వినయ్ కుమార్, జవ్వాజి శ్యాం ప్రసాద్, వేల్పుల నర్సింగరావు, కార్యనిర్వహణ శాఖ అధ్యక్షులుగా ఉప్పు మధుసూదన్, కుదురు రవికుమార్, జాయింట్ సెక్రెటరీలుగ ఉప్పు జలపతి, బండారి వెంకట్ ప్రసాద్, ఈసీ మెంబర్స్ గా జట్టు శ్రీనివాస్, కందాల రామిరెడ్డి, వరాల జగన్, కోట శ్రీనివాస్, సాన కార్తీక్, లీగల్ అడ్వైజర్ గా మడిపల్లి రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రేటర్ విద్యానగర్ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరగడానికి సహకరించుకున్న ప్రతి ఒక్కరికి మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు బోనాల నర్సయ్య ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన ఉప్పు తిరుపతి,బట్టు సుధాకర్ మాట్లాడుతూ.. మున్నూరు కాపుల సమస్యలపై పోరాడుతామని సంఘం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హాలియాలో ఘనంగా "హ్యాపీ సండే - ఫన్ డే" కార్యక్రమం నిర్వహణ





ది క్రైమ్ న్యూస్ – నల్గొండ జిల్లా ప్రతినిధి : హాలియా మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, మహాత్మ జ్యోతిబాపూలే బాలిక విద్యాలయంలో "హ్యాపీ సండే – ఫన్ డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగ గురువు సైదులు గారి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు నిర్వహించబడినవి. హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి గారు మాట్లాడుతూ, రోజువారీ జీవన విధానంలో యోగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి గారు, 2వ వార్డ్ కౌన్సిలర్ సలహాదారు నకిరేకంటి సైదులు గారు, 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు మజార్ మొయినుద్దీన్ గారు, 10వ వార్డు కౌన్సిలర్ సలహాదారు పిల్లి ఆంజనేయులు గారు, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్ గారు, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, టీచింగ్ స్టాఫ్, సురభి రాంబాబు గారు, కార్యాలయ సిబ్బంది, ఆర్పీలు, పట్టణ ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్) : అణగారిన వర్గాల అభ్యున్నతికి, స్వేచ్ఛ, సమానత్వం హక్కుల సాధన కొరకు పోరాడిన పోరాట యోధుడు, సంఘసంస్కర్త, ముపై సంవత్సరాలు సుదీర్ఘంగా కేంద్ర క్యాబినెట్లో వివిధ శాఖలకు మంత్రిగా సేవలందించిన బాబు జగ్జీవన్ రామ్ జన్మదిన వేడుకలు అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్. అమీన్ పూర్ సర్కిల్, కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు సిబ్బంది నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈ ఈ వెంకటరమణ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు టీ నర్సింహులు, సాయిలు, ఏ ఈ తిరుమలేష్, శ్రీనివాస్, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## బడుగు వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం ఆదర్శనీయం

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్): బడుగు వర్గాల అభ్యున్నతికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన పోరాటం ఆదర్శనీయమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఆదివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చిన తర్వాత ఆధునిక భారత నిర్మాణంలోనూ ఆయన స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారని పేర్కొన్నారు. గొప్ప రాజకీయవేత్తగా సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడి, అనేక పదవులను చేపట్టి తనదైన ముద్ర వేశారని తెలిపారు. జగ్జీవన్ రామ్ జీవితాంతం బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, దేశ రక్షణ మంత్రిగా ఆయన వేసిన బాటలు దేశాన్ని సురక్షితంగా ఉంచాయని వివరించారు. ముఖ్యంగా యూనిఫాం సేవల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, బాబూ జగ్జీవన్ రామ్ సాయుధ దళాలకు ప్రత్యేక గౌరవం ఇచ్చి దేశ రక్షణలో అందరినీ భాగస్వాములను చేశారని గుర్తు చేశారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సమాజం, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్ గౌడ్, ఆర్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం..

**నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదు**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్): గర్భిణీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. పీసీఎన్డీటీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గర్భంలో ఉన్న శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి చట్టవిరుద్ధ చర్యలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు చట్టబద్ధమైన నమోదు ద్వారా మాత్రమే నిర్వహించాలని సూచించారు. మొదటిసారి నేరం చేస్తే మూడేళ్ల జైలు శిక్షతో పాటు 10 వేల రూపాయల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. పునరా వృతం అయితే ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 50 వేల రూపాయల వరకు లేదా అంతకుమించి జరిమానా విధిస్తారని వివరించారు. సంబంధిత వైద్యులు, సిబ్బంది చట్టాన్ని ఉల్లంఘిస్తే వారి వైద్య అనుమతిపత్రాన్ని సస్పెండ్ చేయడం లేదా పూర్తిగా రద్దు చేస్తారని సీపీ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.

## బాబు జగ్జీవన్ రాంకు ప్రజా సంఘాల ఘన నివాళులు

బెజ్జంకి, ఎప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్) : సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను మండల ప్రజా సంఘాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సానగొండ శరత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.... అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికై జగ్జీవన్ రాం చేసిన సేవలను,త్యాగాన్ని స్మరిస్తూ స్వాతంత్ర్య సమర యోదుడిగా,రాజకీయవెత్తగా సంఘసంస్కర్తగా ఏకథాటిగా 40ఏండ్లు కేంద్ర మంత్రిగా వివిధ శాఖల్లో పరిపాలన దక్షతతో అఖండ భారతావానికి విశేష సేవలాందించిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సమతావాదని కొనియాడారు. ప్రజా సంఘాల నాయకులు దూమాల మహేష్, లింగాల శ్రీనివాస్, కొంకటి రాములు, పాకాల మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, ఎల శేఖర్ బాబు, తిప్పారపు శ్రీనివాస్,రామంచ రవి, లింగాల సురేష్ మహారాజ్, దీటి బాల్ నర్సు, మాసం బాబు, బోనగిరి శేషు కుమార్, బోనగిరి కొత్త రాజు, వడ్లూరి పర్శరాములు, మోదుంపెల్లి రాజు, బోనగిరి చంద్రయ్య, ఉప్పు లేటి బాబు, కొంపెల్లి రాజు, చిలుముల దేవదాస్ , గాలిపెల్లి మల్లయ్య ,మాంకాళి నాగేష్,మాంకాళి భూపేందర్ , బోనగిరి నవీన్, రామంచ సంజీవ్,తదితరులు జగ్జీవన్ రాంకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



## ఈనెల 14న విగ్రహాలు ఆవిష్కరించాలి...

**లేదంటే మేమేందో సూపిత్తం**

**ప్రభుత్వానికి దళిత బహుజన నాయకుల డెడ్లైన్**



తిమ్మాపూర్, ఎప్రిల్5(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రాం119వ జయంతిని దళిత సంఘాల గౌరవాధ్యక్షుడు కనకం రాములు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు మాతంగి లక్ష్మణ్, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు మేడి అంజయ్య,బిసి సంఘ నాయకుడు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ..... సమసమాజ స్థాపనకై అహర్నిశలు పోరాడిన బాబు జగ్జీవన్ రాం గొప్ప నాయకుడని కొనియాడుతూ మండలకేంద్రంలోని జగ్జీవన్ రాం, అంబేద్కర్ విగ్రహాలకున్న ముసుగులను నేటి వరకు తొలగించకపోవడం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. విగ్రహాల ఆవిష్కరణకై ఎమ్మెల్యే కవ్వంపల్లి, మంత్రి పొన్నం, కేంద్ర మంత్రి బండి సంజయ్ లను కూడా కలిసామని,ఆర్టీసీ బేషజాల చర్యలతో విగ్రహాల ఆవరణ చెత్తా,చేదారంతో నిండినా అటువైపు వెళ్లకుండా కేసులు పెడతామని తమను బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సహనం కోల్పోతే ఏ చట్టం కూడా తమను ఆపలేదని, ఈనెల14న విగ్రహాల ఆవిష్కరణపై సంబందిత అధికారులు గానీ, స్థానిక ఎమ్మెల్యే గానీ స్పష్టమైన ప్రకటన చేయాలని లేదంటే దళిత బహుజన ప్రజాగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు.దళిత బహుజన నాయకులు, మాజీ సర్పంచ్ ఊపులేటి ఉమారాణి, మాజీ ఎంపిటీసి కవ్వంపల్లి పద్మ,మాతంగి శంకర్, వంతడ్పుల సంపత్,కన్నం లక్ష్మణ్,సంగుపట్ల మల్లేశం,కొయ్యడ మురళి,కొమ్ము సంపత్,బోయిని సంపత్,సముద్రాల లక్ష్మణ్,కన్నం నర్సయ్య, తాళ్లపల్లి సంపత్,ఆకుల శ్రీనివాస్ గౌడ్, సుగుణాకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జగ్జీవన్ రాంకు బిజెపి నాయకుల నివాళులు



మానకొండూర్, ఎప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో ఆదివారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని బిజెపి మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి నివాళు లర్పించారు. నాయకులు మార్కొండ రమేష్ పటేల్,సొన్నాకుల శ్రీనివాస్, బలరాం, వరప్రసాద్, సునంద్, ప్రదీప్ తదితరులు జగ్జీవన్ రాంకు నివాళు లర్పించిన వారిలో ఉన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 5కె వాక్‌థాన్




క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్ కాలనీలో మైత్రి వాకర్స్ క్లబ్, మైత్రి నగర్ ఫేజ్--2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 5కె వాక్‌థాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఎసి చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ హాజరై జెండా ఊపి వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీ శశిరేఖ, తాజా మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక వ్యాయామం ఎంతో అవసరమని, ఇలాంటి వాక్‌థాన్‌లు ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు ప్రజలకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. వృద్ధులు, యువత, చిన్నారులు సమానంగా పాల్గొనడం ఆనందదాయకమని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. శారీరక శ్రమ ద్వారా మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి గంగా లక్ష్మారెడ్డి ప్రధాన స్పాన్సర్‌గా విశేష సహకారం అందించారు. వాక్‌థాన్‌లో పాల్గొన్న వారందరికీ అల్పాహారం ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైత్రి నగర్ ఫేజ్--2 సలహాదారులు చెన్నారెడ్డి, సుబ్రహ్మణ్యం, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సురేంద్ర, ఇతర అసోసియేషన్ సభ్యులు, మైత్రి వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంపాదకీయం

## భారత్ సరికొత్త అడుగు

కాలచక్రం ఎప్పుడూ ఒకేలా ఉండదు. చరిత్ర పుటలు తిరగేస్తే ఒకనాటి అద్భుత దృశ్యం కనిపిస్తుంది. ప్రాచీన కాలంలో భారతదేశం ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయలా ఉండేది. క్రీస్తు పూర్వం ఒకటవ సహస్రాబ్దిలోనే మన పశ్చిమ తీరాల నుంచి నౌకలు పశ్చియాసియా వైపు పయనించేవి. సింధు లోయ నాగరికత విరాజిల్లుతున్న సమయంలోనే లోథాల్ వంటి ఓడరేవులు మెసొపొటేమియా, ఈజిప్టుతో నిరంతర సంబంధాలు నెరిపేవి. బాబిలోనియన్లు తమ కట్టడాల కోసం భారతీయ టేకును వినియోగించేవారంటే మన ఎగుమతుల స్థాయి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రోమన్ సామ్రాజ్యపు సంపద మన సుగంధద్రవ్యాల కోసం, మస్లిన్ వస్త్రాల కోసం భారత్‌కు ప్రవహించేది. 18వ శతాబ్దం వరకు ప్రపంచ తయారీ రంగంలో మనమే అగ్రగామి. చోళులు సముద్రాలను శాసించారు. శాతవాహనులు రోమ్ దాకా వ్యాపారం విస్తరించారు. అదొక స్వర్ణయుగం. ఆ వైభవం మళ్లీ పునరావృతమయ్యే చారిత్రక సందర్భం ఇప్పుడు మన కండ్ల ముందు సాక్షాత్కరిస్తున్నది. ప్రస్తుతం ప్రపంచం ఒక వింతైన సంక్షోభంలో ఉన్నది. మధ్యప్రాచ్యంలో రగులుతున్న టెక్ యుద్ధం దీనికి నిదర్శనం. ఏప్రిల్ 1న బహ్రెయిన్‌లోని 'బాటెల్కో' టెలికాం సంస్థపై జరిగిన దాడులు కేవలం ఒక క్షిపణి సామాన్యమైనవి కావు. అవి గ్లోబల్ టెక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌పై జరిగిన దాడులు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి దిగ్గజాలు తమ కస్టమర్లను డాటా తరలించుకోమని హెచ్చరించడం ఒక తీవ్రమైన పరిణామం. ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి 18 దిగ్గజ కంపెనీలను ఇరాన్ లక్ష్యంగా ప్రకటించడం ప్రపంచ పెట్టుబడిదారుల్లో గుబులు రేపుతున్నది. గత ఐదేండ్లుగా గల్ఫ్ దేశాలను టెక్ హబ్‌లుగా మార్చడానికి ఖర్చు చేసిన బిలియన్ల డాలర్లు ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయి. ఈ అస్థిరత ప్రపంచ టెక్ మ్యాప్‌ను మార్చేస్తున్నది. పెట్టుబడికి ప్రాణం భద్రత. ఎక్కడైతే శాంతి ఉంటుందో అక్కడికే సంపద చేరుతుంది. మధ్యప్రాచ్యం అస్థిరంగా మారిన వేళ.. ప్రపంచమంతా భారత్ వైపు చూస్తున్నది. భారతదేశం ఇప్పుడు ఒక 'టెక్ సేఫ్ జోన్' (వవఎష్ట్ర ఝుటవ్గ శీఅవ)గా అవతరించింది. మన దేశంలో ఉన్న సైబర్ భద్రత చట్టాలు, డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ యాక్ట్ వంటివి అంతర్జాతీయ కంపెనీలకు ఒక బలమైన భరోసాను ఇస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూర్ వంటి నగరాలు కేవలం ఐటీ సెంటర్లు మాత్రమే కాదు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన సురక్షిత దుర్గాలు. యుద్ధ మేఘాలు లేని ఆకాశం, స్థిరమైన ప్రభుత్వం మన దేశానికి అదనపు బలాన్ని ఇస్తున్నాయి. భారతదేశ భౌగోళిక స్థానం మనకు దేవుడిచ్చిన వరం. హిందూ మహాసముద్రం మధ్యలో ఉండటం వల్ల ప్రపంచ వాణిజ్య మార్గాలపై మనకు సహజసిద్ధమైన పట్టు లభిస్తున్నది. సుమారు 7,516 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం మనల్ని ఆసియా, ఆఫ్రికా, ఐరోపా దేశాలకు వారధిగా నిలబెట్టింది. ఉత్తరాన హిమాలయాలు మనకు రక్షణ కవచంలా ఉన్నాయి. చైనా దూకుడును అడ్డుకోవడంలో భారత్ ఇప్పుడు ఒక 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మారింది. ఈ భౌగోళిక రాజకీయ ప్రాధాన్యత వల్లే అగ్రరాజ్యాలు మనతో జట్టు కట్టడానికి పోటీ పడుతున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ పాత్ర ఇప్పుడు అనివార్యం. ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న మరో నినాదం 'చైనా ప్లస్ వన్' గతంలో ప్రపంచమంతా చైనాపైనే ఆధారపడింది. కానీ వాణిజ్య యుద్ధాలు, కొవిడ్ సమయంలో వచ్చిన సరఫరా గొలుసుల అంతరాయం ప్రపంచం కండ్లు తెరిపించాయి. ఒకే దేశంపై ఆధారపడటం ఎంతటి ఆత్మహత్యాసదృశమో కంపెనీలు గుర్తించాయి. ఈ ప్రత్యామ్నాయ వ్యూహంలో భారత్ మొదటి వరుసలో ఉన్నది. ఆపిల్, శామ్‌సంగ్ వంటి సంస్థలు తమ తయారీ కేంద్రాలను చైనా నుంచి భారత్‌కు తరలిస్తున్నాయి. ఇది మన పారిశ్రామిక భవిష్యత్తును మార్చబోయే మహా విప్లవం. మన దేశంలో జరుగుతున్న డిజిటల్ మార్పులు అమోఘం. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు జరుగుతున్న దేశం మనది. సెమీకండక్టర్ల తయారీలో మనం వేస్తున్న అడుగులు భవిష్యత్తులో మనల్ని గ్లోబల్ లీడర్‌గా నిలబెడతాయి. ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతున్న నిర్మాణం. ఈ దశాబ్దం (2020-2030) భారతదేశానిది. అమెరికా-చైనా మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు మనకు ఒక సువర్ణావకాశం. భవిష్యత్తులో భారత్ కేవలం ఒక మార్కెట్‌గానే కాకుండా, ప్రపంచానికి కావాల్సిన ఉత్పత్తులను అందించే కర్మాగారంగా మారుతుంది. చివరగా ఒక మాట. అవకాశం ఎప్పుడూ తలుపు తట్టదు, అది మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. ఇప్పుడు ప్రపంచంలో నెలకొన్న అశాంతి, అనిశ్చితి మన దేశానికి ఒక మారువేషంలో వచ్చిన అదృష్టం. గతాన్ని గర్వంగా చెప్పుకోవడమే కాదు, భవిష్యత్తును మనమే నిర్మించుకోవాలి. మన విధానాలు, దౌత్య సంబంధాలు మరింత పటిష్టం కావాలి. పేదరికాన్ని రూపుమాపడానికి, నిరుద్యోగ రక్కసిని తరిమికొట్టడానికి ఇదే సరైన సమయం. ఇది మనకు లభించిన 'ఇప్పుడే.. లేదా ఎప్పటికీ కాదు' అనే కీలకమైన సందర్భం. ఈ అవకాశాన్ని ఒడిసి పట్టుకుంటే, భారతదేశం మళ్లీ ప్రపంచ వేదికపై అగ్రపీఠాన్ని అలంకరించడం ఖాయం.

## ప్రశ్నించేతత్వానికి కేజ్రీవాల్ వ్యతిరేకమా?



ఆమ్ఆద్మీపార్టీ రాజ్యసభ ఉపనాయకుడు, యంగ్ డైనమిక్ లీడర్ రాఘవచద్దాను ఆఘమేఘాల మీద తొలగిస్తూ, ఆస్థానంలో పంజాబ్‌కు చెందిన మరో యంపి అశోక్ మిట్టల్‌ను నియమించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. రాజ్యసభలో ఉప నాయకుడు ఎవరుండాలి అనేది ఆయన ఇష్టమే కావచ్చును. కానీ, ఆయన్ను తొలిగించిన సందర్భం, తొలిగిస్తూ రాఘవచద్దాకు రాజ్య సభలో మాట్లాడడానికి ప్రాదాన్యత ఇవ్వొద్దు అని రాసిన లేఖ! కేజ్రీవాల్‌ను ఇప్పటివరకు ఒక వ్యక్తిత్వం, అవినీతి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అన్నా లేబుల్ తనకు తానే తుడిచి వేసుకున్నాడు. ఏకవ్యక్తి కేంద్రక రాజకీయ వ్యవస్థ ప్రతినిధి అని తనకు తాను నిరూపించుకున్నారు. రాఘవచద్దాను ఆయన సంధించేబాణాలు, లేవనెత్తే ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పలేక రాజ్యసభ నుండి సస్పెండ్ చేస్తే, దాన్ని బలపరుస్తూ తాను బిజెపికి అసలుసిసలైన ప్రత్యామ్నాయం అని చెప్పుకునే కేజ్రీవాల్ తీసుకున్న నిర్ణయం బిజేపిని బేషరతుగా బలపరిచే దిశగా ఉంది, తప్ప మరోరకంగా కనిపించదు. ఆమ్ఆద్మీ పార్టీ యంపి రాఘవచద్దా ఇటీవల కాలంలో రాజ్యసభలో కార్పోరేట్ శక్తుల దోపిడీని కొత్తకోణంలో బయట పెట్టాడు. ముఖ్యంగా వివిధ కంపెనీలు నెల రీఛార్జి పేరుతో 28రోజుల కాలపరిమితి నే నెలగా పేర్కొన్నారని రాజ్యసభలో ఎండగట్టారు.వందల కోట్ల రూపాయల రీచార్జ్ కుంభకోణం బయట పెట్టడమే కాక,చట్టసభల ప్రజాప్రతినిధులు నెలకుకేవలం300 రూపాయల రీచార్జ్ నెలకు అపరిమిత వాడకంకుసరిపోతుండ గావాళ్ళకు పది వేల రూపాయలు ఫోన్ చార్జీల క్రింద చెల్లించడం ఎందుకు?ఇది ప్రజల సొమ్ము దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు.ఇట్లాంటి సంచలనాత్మక విషయాలను ఆయన రాజ్యసభలో ప్రస్తావించడం ద్వారా దేశంలోని యువతలో విపరీతమైన క్రేజ్ వచ్చింది.మద్యతరగతివర్గంతమకు ఓప్రాతినిద్యం లభించింది అనిసంబరపడ్డారు.దీనితో చిర్రెత్తు కొచ్చిన కేజ్రీవాల్ ఆయన్ను రాజ్యసభ ఉపనాయకుడుగా తొలగించడంతో పాటు,ఆయనకు ప్రాదాన్యత ఇవ్వొద్దు అని రాయడం రాజ్యసభ చరిత్రలోనే సంచలనం కలిగించింది. గెలుపు కోసం 'సీట్ల పెంపు' వ్యూహం కానీ , కేజ్రీవాల్ చర్య దాన్ని తుడిచి పెట్టింది.రాజ్యసభ ద్వారా రాఘవ చద్దా దేశవ్యాప్తంగా అభిమానం సంపాదించుకోవడం ఇష్టంలేదా?తాను కోల్పోయిన స్థానాన్ని రాఘవ చద్దాపూరించుకుంటున్నాడనే అంతర్గత ద్వేషమా? లేదా ప్రత్యామ్నాయ నాయకత్వం స్థానం భర్తీ చేస్తాడనే భయమా?ఏదైనా కావచ్చును.మొత్తం మీద రాఘవ చద్దా ప్రాదాన్యత తగ్గించడం జరిగింది,రేపు ఆయనను పార్టీ నుండి గెంటి వేయడం కూడా జరుగవచ్చును? ఏదిఎలా ఉన్నా మరోసారి అరవింద్ కేజ్రీవాల్ తన లోపలి మనిషి ని బయట పెట్టుకొని, ప్రశ్నించే స్వభావాన్ని చంపి వేశాడని దేశ యువత భావిస్తుంది.ఇలా ప్రశ్నించే స్వభావాలు గొంతు నులపడం ఒక్క రాఘవచెద్దాతో మొదలు కాలేదు.ఢిల్లీ ఎన్నికల ముందు మరో రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలైవాల్ ని పార్టీ నుండి సాగనంపారు. అంతకుముందుఆమ్ఆద్మీ పార్టీ పెట్టిన తొలినాళ్ళలో యోగేంద్ర యాదవ్,కిరణ్ బేడీ లాంటి ప్రశ్నించే మేదావులను పొమ్మనకుండానే పొగ పెట్టారు. ప్రత్యర్థులపై ప్రశ్నలు వర్షం కురిపించే కేజ్రీవాల్ విచిత్రంగా తమపార్టీ నేతలు ప్రశ్నలు,ఎదుగుదలను సహించలేక పోవడం అనేది ఆయనకు ఆకస్మికంగా వచ్చిన మార్పు కాదు.

## పర్యావరణ విధ్వంసం పట్టని ప్రజలు

**పెరుగుతున్న ఎండలతో జనం అవస్థలు**

**మొక్కలు నాటాలన్న స్పృహ లేని సమాజం**



న్యూఢిల్లీ : పర్యావరణ విధ్వంసంపై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగి పోతున్నాడు. ఎండ వేడిమి, వడ గాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉత్తరభారతం అయితే క్రమంగా నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుండ టంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగ నుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పరిశు భ్రత, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాల్సిఉంది. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో ఉండడం వల్లనే చెట్లను నరికేస్తున్నా చోద్యం చూశారు. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటి కాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. ఇకపోతే ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణ మయ్యాయి. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటి లే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికే స్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతు న్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు రెండు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవుతుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇంతకాలం మనం చేసిన విధ్వంసం కారణంగానే అన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వైరస్‌లు ఇకముందు కూడా దాడి చేస్తాయని గుర్తించాలి. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నద అలవాటు కావాలి. మొక్కలను పెంచడం మన బాధ్యత కావాలి.

## అటకెక్కిన మొక్కల పెంపకం


**ఎక్కడా కానరాని నర్సరీల హడావిడి**

**సామాజిక అడవుల బాధ్యతను విస్మరించిన మంత్రి**

నిజామాబాద్ : తెలంగాణలో చేపట్టిన హరితహారం మంచి ఫలితాలు ఇచ్చింది. అయితే అందులో మంచిచెడులను విశ్లేషించి ముందుకు సాగాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా ఎక్కడా ఆ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిశ్చయంతో గతంలో పనిచేశారు. కోతులు వాపస్ పోవాలన్న కెసిఆర్ నినాదాం కూడా బాఆనే పనిచేసింది. కానీ ఇప్పుడు అలా జరగడం లేదు. మానవజాతి మనుడగకు చెట్లు సజీవసాక్ష్యం. వృక్షాలు అంతరించడం వల్లనే సరైన వర్షాలు కురువడం లేదని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. వరుణ దేవుడు కరుణించడంతో చాలాచోట్ల నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి. అయితే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇది నిరంతరాయంగా కొనసాగాలి. దీనికి పెద్దపీట వేయాలి. హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాలని కెసిఆర్ సన్నాహాలు చేసారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేసారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపట్టేలా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టింది. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ నర్సరీల్లో పండ్ల విభాగంలో జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, కర్జూరా, ఫ్లవరింగ్, సాధారణ మొక్కలు కానుగ, చింత, నీలగిరి, కుంకుడు, వెదురు, వంటి మొక్కలు పెంచారు. నర్సరీలో ఉన్న మొక్కలకు నీరుపట్టి బతికించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటూ, ఆయా నర్సరీ బాధ్యులకు ఎప్పటి కప్పుడు సూచనలు ఇస్తూ, వాటిని సందర్శిస్తూ, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కాగానే జూలైలో కార్యక్రమం ప్రారంభం అయ్యేది. కానీ అటవీశాఖ మంత్రిగా కొండా సురేఖ అడవుల రక్షణ పెంపకంపై ఎక్కడా శ్రద్ద పెట్టడం లేదు. నిరంతరాయంగా మొక్కలు పెంచే విధంగా కార్యాచారణ చేయడం లేదు. దీంతో మొక్కల పెంపకం అటకెక్కింది.

## మౌనం గొప్పతనం

సంభాషణలే మన ఆలోచనలను తీర్చిదిద్దుతాయి. అయితే, మనకు తెలియని ప్రపంచం మౌనంలో, నిశ్శబ్దంలో ఉందనే సంగతిని మనం గమనించం. ఇక మౌనం అంటే మాట్లాడకుండా ఉండటం అనుకుంటారు. కానీ, అది నిజం కాదు. మౌనం అనేది మనల్ని మన మనసులో గూడుకట్టుకుపోయిన భావాలను గమనించేలా చేస్తుంది. అలా మన ఆలోచనల్ని పరిశీలిస్తున్న కొద్దీ అవి మన భావోద్వేగాల్ని ఎలా ప్రేరేపిస్తున్నాయో, మన ప్రవర్తనను ఎలా నడిపిస్తున్నాయో తెలుస్తుంది. మన అంతరంగంలోకి మనం తొంగిచూసుకుంటే లోలోతుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికివస్తుంది. మౌనం ద్వారానే మన చెవులు వినలేని దానిని మనం వినగలుగుతాం. కాబట్టి, కేవలం మాట్లాడకపోవడమే మౌనం కాదు. మన అంతరంగాన్ని వినడం అలవాటు చేసుకుంటే మౌనం గొప్పతనం నెమ్మదిగా అర్థమవుతుంది. అది మనల్ని విశ్వ సందేశాన్ని వినేలా చేస్తుంది.



ఆధ్యాత్మికం

# ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో సత్వర న్యాయం

**బాధితులు ఈ సేవను వినియోగించుకోవాలి.**

**జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 35 కేసులు నమోదు**

**జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఎప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్) : బాధితులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో మహబూబాబాద్ జిల్లా పోలీసులు అమలు చేస్తున్న "ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్" విధానం ద్వారా ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు అందుతున్నాయి. పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉన్న బాధితులు స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, పోలీసులు స్వయంగా ఘటన స్థలానికి లేదా బాధితుని వద్దకు వెళ్లి ఫిర్యాదు నమోదు చేయడం ఈ విధానం ప్రత్యేకత. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 35 ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ విధానం వల్ల బాధితులకు తక్షణ న్యాయం అందడమే కాకుండా, పోలీస్ సేవలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని అన్నారు. ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయగల ప్రధాన అంశాలు : 1. మహిళలు మరియు చిన్నారులపై నేరాలు, 2. లైంగిక నేరాలు (గృహహింసా, అత్యాచారం తదితరాలు), 3. ఎస్సీ / ఎస్టీ అఘాయిత్యాలు, 4. ఆస్తి సంబంధిత నేరాలు (చోరీ, దోపిడీ), 5. వృద్ధులపై నేరాలు, 6. ప్రత్యేక చట్టాల కింద కేసులు శ్రీ(డౌరీ, చైల్డ్ మ్యారేజ్, ర్యాగింగ్ మొదలైనవి), 7. పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితిలో ఉన్న బాధితులకు సంబంధించిన ఇతర నేరాలు ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు మరియు దూర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని ఎస్పీ తెలిపారు. బాధితుని వద్దకే చేరుకుని ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా సమయాన్ని ఆదా చేయడంతో పాటు, నేరాలపై వేగంగా చర్యలు తీసుకునే అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. "బాధితులకు సత్వర న్యాయం అందించడమే పోలీస్ శాఖ లక్ష్యం. ప్రజలకు చేరువగా ఉండే పోలీసింగ్ ద్వారా వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నాము," అని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ప్రజలు ఈ సేవను వినియోగించుకుని నిర్భయంగా ముందుకు వచ్చి పోలీసులను సంప్రదించాలని ఎస్పీ కోరారు.

## బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిద్దాం

**ఆరెకపూడి గాంధీ**



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉండాలని, ఆయన చేసిన సేవలను ఎప్పటికీ స్మరించుకోవాలని ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్తగా అఖండ భారతావనికి విశేష సేవలు అందించిన భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు సీనియర్ నాయకులు రఘునాథ్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ గొప్ప దార్శనికుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సమాజ సంస్కర్తగా దేశానికి అపార సేవలు అందించారని తెలిపారు. దళితుల అభ్యున్నతి, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి అపారమని, ఆయన జీవితం ఈ తరం ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జయంతిని సమానత్వ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. అదేవిధంగా, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను దేశ ప్రజల్లో పెంపొందించడంలో ఆయన పాత్ర అమోఘమని కొనియాడారు. నిమ్న వర్గాల నుండి ఉన్నత స్థానాలకు ఎదిగిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన ఆశయాల సాధన కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయినేని చంద్రకాంత్ రావు, ప్రసాద్, వెంకటేష్ గౌడ్, ముకేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా చలివేంద్రం ప్రారంభం



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్తగా విశేష సేవలు అందించిన భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని రాజారాం కాలనీలో సీనియర్ నాయకులు రఘునాథ్ రావు ఆధ్వర్యంలో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేసి తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు, బాటసారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ వేసవికాలంలో పెరుగుతున్న ఎండల నేపథ్యంలో చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమని అన్నారు. ప్రజలు దాహార్తి నుండి ఉపశమనం పొందేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని, నీటి దానం అన్నింటికంటే గొప్పదని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించాలని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకుడు రఘునాథ్ రావుని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కార్యక్రమం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయినేని చంద్రకాంత్ రావు, ప్రసాద్, వెంకటేష్ గౌడ్, ముకేందర్, కుమార్ తదితరులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బిజెపి శ్రేణులందరికీ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

**స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్ టౌన్, ఏప్రిల్5(ది క్రైమ్ న్యూస్) : భారతీయ జనతా పార్టీ జాతీయ శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆదివారం రోజున హుజురాబాద్ లోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కుటుంబ సభ్యులకు భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏప్రిల్ 6, 1980న అటల్ బిహారీ వ వాజ్ పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన బిజెపి , దేశ సేవ, ఆత్మ నిర్భర భారత్ లక్ష్యంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందన్నారు. భారతీయ జనతా పార్టీ ఎంచుకున్న సిద్ధాంతం, భావాజాలం తో నే పార్టీ ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా అవతరించిందని , వరల్డ్ లోనే అతిపెద్ద క్యాడర్ బేస్డ్ పార్టీ బిజెపి యే అన్నారు.ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన భారతీయ జనతా పార్టీ నేడు దేశాన్ని ఏలుతుందని , వరుసగా 3 సార్లు కేంద్రం లో అధికారం లో వచ్చిందని, దేశంలోనే తిరుగు లేనిశక్తిగా అవతరించిందన్నారు. బీజేపీ పార్టీ సిద్ధాంతం ఎంతో గొప్పదన్నారు.నేషన్ ఫస్ట్.,పార్టీ నెక్ట్స్, సెల్ఫ్ లాస్ట్ సిద్ధాంతం... దేశం కోసం మన పార్టీ ఆలోచించే విధానంతోనే పార్టీ ఈ స్థితికి వచ్చిందన్నారు.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, బిజెపి పట్ల ప్రజలంతా ఎంతో విశ్వాసంతో ఉన్నారని తెలిపారు.

## సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

**సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్. కాటారం డివిజన్**



ఏప్రిల్ 5 ది క్రైమ్ న్యూస్ : కాటారం డివిజన్ కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర నాయకులు మరియు డి టి ఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు మరియు విద్యా పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి ఎం రఘు శంకర్ రెడ్డి కోరారు. తేదీ 5 4 2026 ఆదివారం నాడు స్థానిక ఆదర్శ విద్యాలయంలో ఐదు మండలాల (అనగా పలిమెల మహాదేవపూర్ కాటారం మహా ముత్తారం మనోహర్రావు) కాటారం రెవెన్యూ డివిజన్ స్థాయి పెన్షనర్స్ మరియు సీనియర్ సిటిజన్స్ సమావేశం సీనియర్ సిటిజెన్ జె కరుణాకర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎం రఘు శంకర్ రెడ్డి మాట్లాడుతూ కాటారం డివిజన్ స్థాయిలో సుమారు 450 మంది పెన్షనర్స్ మరియు వేలాదిగా సీనియర్ సిటిజన్స్ ఉన్నందున సీనియర్ సిటిజన్స్ రిక్రియేషన్ మరియు డేకేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా శారీరక మానసిక ఉల్లాసం కొరకు జీవన నాణ్యత కాపాడుకోవడం కొరకు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు.ఈ విషయంలో ప్రత్యేకంగా స్థానిక శాసనసభ్యులు మరియు రాష్ట్ర సీనియర్ మంత్రివర్యులు శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు గారు ప్రత్యేక చొరవ తీసుకొని మంజూరి చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహాదేవపూర్ మండలం నుండి సంఘ ప్రతినిధులు అంకమ్మ అంకన్న శంకరయ్య వెంకటి కాటారం నుండి ఎం రవి శంకర్ రెడ్డి ఎం రఘు శంకర్ రెడ్డి జె కరుణాకర్ రావు మలహర్రావు నుండి మధుసూదన్ రావు మహా ముత్తారం నుండి దామోదర్ రెడ్డి తో పాటు డి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ తిరుపతి పాల్గొన్నారు.

## ఘనంగా మియాపూర్‌లో ఈస్టర్ ప్రార్థనలు

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : మియాపూర్‌లోని కాల్వరీ టెంపుల్‌లో ఆదివారం



ఈస్టర్ ప్రార్థనలు ఘనంగా జరిగాయి. 3వ ప్రార్థనా సేవ సుమారు 30 వేల మంది భక్తుల పాల్గొనడంతో ప్రశాంతంగా ముగిసింది. అనంతరం 4వ సేవ ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొత్తం సుమారు 1.7 లక్షల మంది భక్తులు ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం హోం గార్డ్స్ నుంచి ఏసీపీ స్థాయి అధికారుల వరకు మొత్తం 101 మంది సిబ్బందిని విధుల్లో నియమించారు. వాహనాల పార్కింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేసి, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరు ప్రదేశాలు కేటాయించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కడా లేకుండా సజావుగా నిర్వహించడంలో పోలీస్ సిబ్బంది సమర్థంగా పనిచేశారు.

## కరీంనగర్‌లో 'స్లోకా స్పోర్ట్స్' భారీ క్రీడా కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్





కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్)నగరంలోని గాంధీ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అతిపెద్ద క్రీడా విక్రయ కేంద్రం 'స్లోకా స్పోర్ట్స్'ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ చోప్పరి యాదగిరి సునీల్ రావుతో పాటు పలువురు బీజేపీ కార్పొరేటర్లు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులకు కావాల్సిన అన్ని రకాల నాణ్యమైన క్రీడా సామాగ్రిని ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, కరీంనగర్ వంటి నగరాల్లో ఇలాంటి అత్యాధునిక స్పోర్ట్స్ హబ్స్ రావడం వల్ల స్థానిక క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.స్లోకా స్పోర్ట్స్ ప్రత్యేకతలు:ఈ కేంద్రంలో అన్ని రకాల క్రీడా పరికరాలతో పాటు, ఆకర్షణీయమైన జ్ఞాపికలు (మేమేంటోస్ ), ట్రోఫీలు, పతకాలు (మెడల్స్ )నాణ్యమైన స్పోర్ట్స్ టీ-షర్టులు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్ ప్రజలు, క్రీడా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, క్రీడాభిమానులు వ్యాపార ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి కార్యకర్తల ఇండ్లపై ఎగిరిన బిజెపి జెండా



తిమ్మాపూర్, ఎప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్) : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని బిజెపి కార్యకర్తలు ఆదివారం తమ ఇండ్లపై బిజెపి జెండా ఎగురవేశారు. నేడు బిజెపి ఆవిర్భావం సందర్భంగా ముందస్తుగా ప్రతీ ఇంటిపై బీజేపీ జెండాను ఎగురవేయాలని జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపిచ్చిన నేపథ్యంలో మండలంలోని కార్యకర్తలంతా వారి ఇండ్లపై జెండాను ఎగురవేసినట్లు పార్టీ మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి తెలిపారు.పార్టీ ఆవిర్భావ కార్యక్రమాల్లో భాగంగా 3రోజుల పాటు బూత్ల వారిగా జెండా వేడుకలు నిర్వహించనున్నట్లు సుగుర్తి పేర్కొన్నారు.

## తీసుకున్న అప్పు చెల్లించాలని బాధితురాలి ధర్నా

**-భార్యాభర్తపై పోలీసులకు ఫిర్యాదు..**




పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అవసరాల నిమిత్తం తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు తనపై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు ఒద్దం స్వరూప అప్పు తీసుకున్న వారి ఇంటిముందు ఆదివారం ధర్నా చేపట్టింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి శాంతినగరుకు చెందిన భార్యాభర్త తోడేటి సంధ్య బాపు తనవద్ద నుండి రెండేళ్ళక్రితం రూ.43లక్షలు తీసుకొని రూ.20లక్షలు చెల్లించారని, మిగతా డబ్బులు అడిగితే ధూషిస్తున్నారని ఆరోపించింది. రియల్ ఎస్టేట్, బంగారం స్కీం పేరుతో తనను మోసగించారని పేర్కొంటు పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేసి డబ్బులు ఇప్పించాలని పోలీసులను స్వరూప వేడుకున్నది.

## వార్డు ప్రజల సమస్యలపై నిరంతర కృషి

**- కౌన్సిలర్ ఉప్పు స్వరూప - రాజన్న**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి మున్సిపల్ 22వ వార్డు లక్ష్మీ గణపతి నగర్ లో ఆదివారం తెల్లవారుజామున ఆవుదూడ (మూగ జీవి) అపస్మారక స్థితిలో మరణించి ఉండగా వార్డు ప్రజలు వెంటనే కౌన్సిలర్ ఉప్పు స్వరూప - రాజన్న కు సమాచారం తెలియజేయగా తక్షణమే స్పందించిన కౌన్సిలర్ మున్సిపల్ సిబ్బందితో మరణించిన ఆవు దూడను చెత్త టాక్టర్ లో అక్కడినుంచి పంపించి ఆ పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజలకు ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకువస్తే శ్రాయశక్తుల కృషి చేస్తామన్నారు. సమాచారం తెలిసిన సమస్యపై వెంటనే స్పందించిన కౌన్సిలర్ కు వార్డు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బిజెపి నూతన మండలాధ్యక్షుడిగా చింతం శ్రీనివాస్

తిమ్మాపూర్, ఎప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బిజెపి నూతన మండలాధ్యక్షుడిగా మక్తపల్లికి చెందిన చింతం శ్రీనివాస్ ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లాలోని మూడు మండలాలకు అధ్యక్షులను నియమించగా తిమ్మాపూర్ మండలాధ్యక్షుడిగా చింతం శ్రీనివాస్ నియమితులైయ్యారు. మండలాధ్యక్షుడిగా తనను నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డికి, సహకరించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలుపుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చింతం శ్రీనివాస్ హామీ ఇచ్చారు.



# బేడ బుడగ జంగం రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మానం



కరీంనగర్, ఏప్రిల్5(ది క్రైమ్ న్యూస్) : నగరం లోని బేడ బుడగ జంగం రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రోజున కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బేడ బుడగ జంగం కులం నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించిన భూపతి రవీందర్ ని వేదికపై ఘనంగా సత్కరించారు. ఆయన సాధించిన విజయం బేడ బుడగ జంగం సమాజానికి గర్వకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. సమాజం రాజకీయంగా మరింత ముందుకు రావడానికి ఇలాంటి నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ సునీల్ రావు విచ్చేసి అభినందనలు తెలియజేసి , బేడ బుడగ జంగం సమాజం సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షులు ఆల్ ఇండియా బేడ బుడగ జంగం కాన్ఫెడరేషన్ డాక్టర్ ఎన్ఆర్ వెంకటేశం మాట్లాడుతూ సమాజ ఐక్యత, రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కడమంచి సహదేవుడు (రాష్ట్ర అధ్యక్షులు బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి), సిరిపాటి వేణు (రాష్ట్ర అధ్యక్షులు -- బేడ బుడగ జంగం జన సంఘం), మోటం రామ్ కుమార్ (బేడ బుడగ జంగం నాయకులు) ప్రోగ్రాం ఆర్గనైజర్ కళ్యాణం శరత్ చంద్ర, బేడ బుడగ జంగం మేధావుల ఫోరం నాయకులు, డాక్టర్ కళ్ళెం ఆంజనేయులు, రిటైర్డ్ టీచర్ నరసింహ లతోపాటు బేడ బుడగ జంగం జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు, స్థానిక నాయకులు, యువజన నాయకులు సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బిజెపి కుటుంబ సభ్యులందరికీ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

### బిజెపి జెండాను ఎగురవేసిన మేయర్, డిప్యూటీ మేయర్





కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్)ఏప్రిల్ 6 న 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ పార్టీ పీలుపు మేరకు ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం రోజున నగర మేయర్ కొలగని శ్రీనివాస్ తీగల గుట్టపల్లి లోని తన స్వగృహంపై, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు స్వగృహం పైన,పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 న అటల్ బిహారీ వాజ్ పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు వరల్డ్ లోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ఆవిర్భవించిందన్నారు.బిజెపి సిద్ధాంతం ,నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ నినాదమే బీజేపీ నీ తిరుగులేని శక్తిగా మార్చిందన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం నేడు దేశాన్ని ఏలే స్థితికి వచ్చి, వరుసగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు బిజెపి పట్ల దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని విశ్వసాన్ని వమ్ము చేయకుండా ముందు కొనసాగుతుందన్నారు. . ముఖ్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జాతీయ భద్రతకు , దేశ అభివృద్ధి కోసం పెద్ద పీట వేసి ముందుకుకొనసాగుతుందన్నారు. ప్రధానంగామోడీ 2014లో వచ్చాక దేశంలో ప్రతీ రంగంలోనూ శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికా బద్ధంగా ముందుకు కొనసాగుతున్నారని తెలిపారు.

# మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శలు



బెజ్జెంకి, ఎప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్):సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ కు చెందిన బీఆర్ఎస్ సినియర్ నాయకులు ముక్కిస మహిపాల్ రెడ్డి, చంద్రారెడ్డిల తల్లి కనుకవ్వ, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి , రమణరెడ్డిల మేనత్త ముక్కిస ముత్తవ్వ ఇటీవల మరణించగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, ముక్కిస తిరుపతి రెడ్డి, ముక్కిస రాజిరెడ్డి, లింగాల అర్జున్, లక్ష్మారెడ్డి , శ్రీనివాస్ రెడ్డి అంజిరెడ్డి, ఏడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, రమణ రెడ్డి, పల్లె శ్రీనివాస్ రెడ్డి, బోనగిరి శంకర్, తాడిచెట్టు రవి తదితరులు రసమయి వెంట పరామర్శలో పాల్గొన్నారు.





# మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్

# 119వ జయంతి వేడుకలు

### డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

### -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

భూపాలపల్లి, ఏప్రిల్ -5: (ది క్రైమ్ న్యూస్) : స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నిరుపేద కుటుంబంలో జన్మించి కేంద్రమంత్రిగా, ఉప ప్రధానిగా దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆనాటి ప్రభుత్వం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కూతురు మీరా కుమారికి స్పీకర్ పదవి ఇచ్చి సముచితంగా గౌరవించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. దేశానికి సేవలు అందించిన మహనీయులు విగ్రహాలు జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో కూడళ్లు అభివృద్ధికి 10 కోట్లు మంజూరు చేశామని, అలాగే రహదారుల అభివృద్ధి కూడా జరుగుతుంది కాబట్టి దేశ ప్రజలకు సేవకులు అందించిన మహనీయుల విగ్రహాలు ఏర్పాటుకు కృషి చేస్తామని, విగ్రహాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బీహార్ లోని చిన్న కుగ్రామంలో జన్మించిన డా బాబు జగ్జీవన్ రామ్ దేశానికి కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా తన అమూల్యమైన సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. ప్రతి ఒక్కరూ కృషి, పట్టుదలతో సాధన చేస్తే విజయం సాధ్యమవుతుందని నిరూపించిన గొప్ప వ్యక్తి డా బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. సామాజిక న్యాయం కోసం డా బాబు జగ్జీవన్ రామ్ విశేషమైన కృషి చేశారని తెలిపారు. 1971 ఇండియా పాకిస్థాన్ యుద్ధ సమయంలో మన రక్షణశాఖ మంత్రిగా దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. నేటి తరాలకు డా బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శమని యువత ఆయన బాటలో పయనించి అభివృద్ధిలో మన జిల్లాకు, రాష్ట్రానికి తద్వారా దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఎస్సి అభివృద్ధి అధికారి ఇందిర, కౌన్సిలర్లు, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కమిటి సభ్యులు, బిసి సంగం నాయకులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్

### మాజీ ఎమ్మెల్యే రసమయి



ఇల్లంతకుంట, ఎప్రిల్ 5(ది క్రైమ్ న్యూస్):రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ లో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ముఖ్య అతిథిగా హాజరై జగ్జీవన్ రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రసమయి మాట్లాడుతూ.... జగ్జీవన్ రాం జయంతి రోజు జరుపుకునే "సమతా దివస్" సందర్భంగా, సమాజ సమానత్వం, ఐక్యత, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బీహార్ లోని వెనుకబడిన వర్గాలకు చెందిన జగ్జీవన్ రామ్ భారత పార్లమెంటులో 40 ఏండ్లపాటు వివిధ మంత్రి పదవులను నిర్వహించడమే కాక ఉప ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో కీలక పాత్ర పోషించి,1937లో బీహార్ శాసనసభకు ఎన్నికై గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని నిర్మించి బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్రమైన కృషి చేశారని గుర్తు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, పార్టీ మండలాధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డిలను సర్పంచ్ గన్నేరం వసంత,ఉప సర్పంచ్ ఎలవేని రమేష్ వార్డు సభ్యులు సన్మానించారు.

# కరీంనగర్‌లో ఘనంగా యేసుక్రీస్తు పునరుత్థాన సువార్త ర్యాలీ





### కరీంనగర్ జిల్లా, నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

కరీంనగర్ టౌన్, ఏప్రిల్5(ది క్రైమ్ న్యూస్)కరీంనగర్ జిల్లా, నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో 'యేసుక్రీస్తు పునరుత్థాన సువార్త ర్యాలీ' అత్యంత ఘనంగా నిర్వహించబడింది. లోకరక్షకుడైన యేసుక్రీస్తు మరణాన్ని గెలిచి తిరిగి లేచిన సందర్భాన్ని (ఈస్టర్) పురస్కరించుకుని ఈ భారీ ప్రదర్శనను చేపట్టారు.ఈ ర్యాలీలో కరీంనగర్ నగరంలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు వేలాది మంది విశ్వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ పొడవునా భక్తులు స్తోత్రగానాలు పాడుతూ, క్రీస్తు పునరుత్థాన సందేశాన్ని చాటిచెప్పారు. లోకానికి శాంతి, సమాధానం మరియు రక్షణ కేవలం దేవుని వల్లనే సాధ్యమని ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు పేర్కొన్నారు.నగర ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో క్రైస్తవ సోదరులు భారీ సంఖ్యలో పాల్గొని, క్రమశిక్షణతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యతను చాటిచెప్పేలా ఈ కార్యక్రమం నిలిచింది.ఈ కార్యక్రమం లో పడిదం జాషువా, కే. నతానియేలు, ఎలిషా, తిమో తితయరాజ్ సంతోష్ కుమార్,మోజన్, దైవజిత్తం ప్రేమ్ సాగర్, కళాకారుల బృందం పాల్గొన్నోరు

# జాతీయ భద్రత, దేశహితం, భరతమాత సేవ కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి

### బిజెపి కుటుంబ సభ్యులందరికీ పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

### బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర



కరీంనగర్ టౌన్, ఏప్రిల్5(ది క్రైమ్ న్యూస్)జాతీయ భద్రత , దేశ హితం, భరతమాత సేవ కోసం దేశంలో పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. ఏప్రిల్ 6 న 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ పార్టీ పీలుపు మేరకు ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం రోజున బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అలుగునూర్ (శ్రీ వెంకటేశ్వర కాలనీ)లోని తన స్వగృహంపై పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 న అటల్ బిహారీ వాజ్ పాయ్ నేతృత్వంలో స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ఆవిర్భవించిందన్నారు. వరల్డ్ లార్జెస్ట్ పార్టీ గా బిజెపి అవతరించడానికి ప్రధాన కారణం పార్టీ సిద్ధాంతమేనన్నారు. నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ నినాదమే బీజేపీ నీ తిరుగులేని శక్తిగా మార్చిందన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బిజెపి ప్రస్థానం నేడు దేశాన్ని ఏలే స్థితికి వచ్చి, వరుసగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు బిజెపి పట్ల దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని విశ్వసాన్ని వమ్ము చేయకుండా ముందు కొనసాగుతుందన్నారు. బిజెపి బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ శ్రేణుల శ్రమ కూడా మరువలేనిదన్నారు. ముఖ్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జాతీయ భద్రతకు , దేశ అభివృద్ధి కోసం పెద్ద పీట వేసి ముందు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా దేశ సమస్యలను గుర్తించడం భవిష్యత్ లో వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు పరస్పర యుద్ధాలతో విచ్ఛిన్నమవుతున్నాయని, భారతదేశం మాత్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ విశ్వ గురువు దిశలో ముందుకు దూసుకుపోతుందన్నారు. మేకిన్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భరభారత్ బలోపేతమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రధానంగామోడీ 2014లో వచ్చాక దేశంలో ప్రతీ రంగంలోనూ శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికా బద్ధంగా ముందుకు కొనసాగుతున్నారని తెలిపారు. దేశానికి , రాష్ట్రాలకుబిజెపి ప్రభుత్వాలే శ్రీరామరక్ష అని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

# భూ కబ్జాదారుల ముఠా గుట్టురట్టు.... ఆరుగురి అరెస్ట్



కరీంనగర్ క్రైం,(ది క్రైం న్యూస్): కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఖాళీ భూములకు నకిలీ పత్రాలు సృష్టిస్తూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ముఠాను కరీంనగర్ టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు .జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కిన్నెర మల్లవ్వ, భామండ్ల రవీందర్,లోకిని పోచయ్య,అనుముల బాలయ్య,లోకిని ఆదిత్య,లోకిని రాజవ్వ అనే ఆరుగురు ఓ ముఠాగా ఏర్పడి నగరంలో ఖాళీగా ఉన్న ప్లాట్లను నకిలీ పత్రాలతో ఒకరి తరువాత ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకుంటూ లింకు డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. ఈ డాక్యుమెంట్లతో అమాయకులకు భూములు అమ్ముతూ వచ్చిన డబ్బులను పంచుకుంటుండగా,పద్మనగర్ లోని ఓ స్థల వివాదంలో జరిగిన విచారణలో ముఠా మోసం బయటపడినట్లు సిఐ సృజన్ రెడ్డి తెలిపారు.

# రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నర్సాపూర్ : రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. గజ్వేల్‌లో మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసిన ఘటనను ఆమె తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రజల సమస్యలు వినిపించుకునే ప్రదేశాలపై దాడులు జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. దాడులు, విధ్వంసాలు పెరగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. రాష్ట్రాన్ని దశాబ్ద కాలంగా సమర్థవంతంగా



పరిపాలించిన మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు కార్యాలయానికి రక్షణ కల్పించలేని పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పోలీసులు తక్షణమే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విశ్వజ



## జుట్టు పెరుగుదలను అడ్డుకుంటున్న ఈ ఆహారాలతో జాగ్రత్త!

చాలామంది తమ జుట్టు పెరగడం లేదని తమ జుట్టు ఆరోగ్యంగా లేదని బాధపడుతూ ఉంటారు. అటువంటి వారు జుట్టు పెరగడానికి తీసుకునే ఆహారాలను గురించి తెలుసుకొని వాటిని తింటే జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. మన జుట్టుకు కూడా పోషకాలు కావాలి. ఆ పోషకాలు ఏ ఆహారంలో ఉంటాయో తెలుసుకొని కచ్చితంగా తినాలి. అప్పుడే మన జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. జుట్టు పెరుగుదలను నిరోధించే ఆహారాలు ఇదే సమయంలో జుట్టు పెరగడానికి తినాల్సిన ఆహార పదార్థాలను తెలుసుకోవడమే కాకుండా మన జుట్టు పెరుగుదలను అడ్డుకుంటున్న ఆహారాల గురించి కూడా మనం తెలుసుకోవాలి.మన జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీసి మన జుట్టు పెరుగుదలను అడ్డుకునే అనేక ఆహారాలు ఉంటాయి. కొన్ని రకాల చెత్త ఆహారాలు మీ జుట్టు రాలిపోయేలా చేస్తాయి. జుట్టు పెరుగుదలను అడ్డుకుంటాయి. అటువంటి వాటిలో ముఖ్యంగా చెప్పవలసింది ఎక్కువగా స్వీట్లు, కేకులు తినడం. %జుఇజూవతీం జఱవషం టతీశీఎ జుఇజూశ్రీశీతీవ వీశీతీవ ానూశ్రీంశీ =ముఙ% ఒకప్పుడు ఐఏఎస్..ఇప్పుడు తెలుగు ఇండస్ట్రీలో కత్తిలాంటి హీరోయిన్ ఇవి తింటున్నారా? మీ జుట్టు రాలిపోవటం పక్కా చక్కెరతో తయారు చేసిన ఆహారాలను తింటే జుట్టు త్వరగా రాలిపోతుంది. చక్కెర అధికంగా ఉండే ఆహారాలు తినడం వల్ల ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఇది హార్మోన్లలో అసమతుల్యతకు కారణం అవుతుంది. జుట్టు రాలిపోవడానికి దోహదం చేస్తుంది. అధికంగా చక్కెర ఉన్న ఆహారాలు తీసుకోవడం జుట్టుకుదుళ్ళను దెబ్బతీస్తుంది. ఇవి తింటే జుట్టు పెరగటం కష్టమే ఇక వేపుళ్ళు.. కొంతమంది డీప్ ఫ్రై చేసిన ఆహారాలను ఎక్కువగా తింటారు. డీప్ ఫ్రై చేసిన ఆహారాలలో ట్రాన్స్ ఫ్యాట్, అనారోగ్య కరమైన నూనెలు ఉంటాయి. ఇవి జుట్టు ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తాయి. విపరీతంగా ఉప్పు వేసిన ఆహారాలు కూడా జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఉప్పు ఎక్కువగా తినడం గుండె ఆరోగ్యానికి మంచిది కాదు. ఉప్పు ఎక్కువగా తినడం జుట్టు సమస్యలకు కూడా కారణం అవుతుంది. ఇవి తింటే చుండ్రు సమస్యతో జుట్టు రాలిపోతుంది అధికంగా ఉప్పు తీసుకోవడంతో డిహైడ్రేషన్ సమస్య వస్తుంది. ఇది మన జుట్టుకుదుళ్ళు సహజ నూనెలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఫలితంగా జుట్టు పొడిబారిపోయి రాలిపోతుంది. జుట్టు పెరగకుండా నిరోధించే ఆహారాలలో పాల ఉత్పత్తులు ఒకటి. పాలు కొన్నిసార్లు మన జుట్టు నూనె ఉత్పత్తిని పెంచి చుండ్రు సమస్యకు మొటిమల సమస్యకు కారణం అవుతాయి. %=వషేశీఎవవఅఎవస ఖీశీతీ్‌శీబ% "పెదవుల రంగును బట్టి మీ ఆరోగ్య సమస్యలు తెలుసుకోవచ్చు!" జుట్టు ఆరోగ్యం కోసం వీటిని తినేటప్పుడు జాగ్రత్త జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే వాటిలో పాలు కూడా ఒకటి కాబట్టి పాల పదార్థాలు జుట్టు ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. హై మెర్క్యూరీ ఫిష్.. ట్యూనా, స్వోర్డ్ ఫిష్, మాకేరేల్ వంటి కొన్ని చేపలలో అధిక స్థాయిలో మెర్క్యురీ ఉంటుంది. ఇక ఈ చేపలను తినడం వల్ల ఇది జుట్టు రాలడానికి కారణం అవుతుంది. జుట్టు ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ఈ ఆహారాల విషయంలో జాగ్రత్తగా ఉండండి.

# చేద్దామా.. 75 చాలెంజ్!



ఇప్పుడంతా.. '75 హార్డ్ చాలెంజ్' ట్రెండ్ కొనసాగుతున్నది. 2025 నూతన సంవత్సర తీర్మానాల్లో.. ఇప్పుడిదే వైరల్‌గా మారింది. దీని గురించి కొత్తగా వింటున్నవారు మాత్రం.. '75 హార్డ్ చాలెంజ్' అంటే ఏమిటి? దీని నియమాలేంటి? దీన్ని కొనసాగించడం వల్ల కలిగే లాభాలేంటి? నష్టాలేంటి? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఈక్రమంలో '75 హార్డ్ చాలెంజ్' గురించి వ్యాయామ నిపుణులు ఇలా వివరిస్తున్నారు. '75 హార్డ్ చాలెంజ్'లో కఠిన నియమాలను పాటించాల్సి ఉంటుంది. అందులో ప్రధానమైనది.. 75 రోజులపాటు ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తీసుకోవాలి. జంక్‌ఫుడ్‌కు, మద్యానికి దూరం పాటించాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా రోజుకు రెండుసార్లు చొప్పున 45 నిమిషాలపాటు వ్యాయామం చేయాలి. ఈ రెండు వ్యాయామాల్లో ఒకటి కచ్చితంగా ఇంటి బయటే చేయాల్సి ఉంటుంది. పార్క్, జిమ్, ఆరుబయట ప్రదేశాలను ఎంచుకోవచ్చు. రోజూ మూడు లీటర్ల మంచినీళ్లు తాగాలి. ప్రతిరోజూ కనీసం 10 నిమిషాలపాటు ఒక నాన్ ఫిక్షన్ పుస్తకం చదవాలి. కొంచెం కష్టమైనా.. ఇష్టంగా ఫాలో అయిపోతే మానసికంగా, శారీరకంగా ఎంతో మార్పు కనిపిస్తుందని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. ఈ చాలెంజ్‌లోకి దిగినవారిలో చాలామంది.. 75 రోజులు పూర్తయినా ఈ నియమాలను కొనసాగిస్తూనే ఉన్నారట. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, ఆహార అలవాట్లు మెరుగుపడటం, పుస్తకాలు చదివే పద్ధతిలోనూ వారు చాలా మార్పులు గమనిస్తున్నారట. 75 రోజులపాటు ఫాలో కావడం వల్ల.. ఈ చాలెంజ్ ప్రభావాలు త్వరగా వదిలిపోవని నిపుణులు చెబుతున్నారు. బయటి ఆహారాన్ని మానేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు డబ్బుకూడా ఆదా అవుతుందని అంటున్నారు. ఇక పుస్తకాలు చదవడం.. ఆలోచనా విధానంలో మార్పులు తీసుకొస్తుంది. ఇలా.. ఇష్టపడి చేస్తే చాలెంజ్‌ను పూర్తి చేయడంతోపాటు దీర్ఘకాలంపాటు కొనసాగించవచ్చని సలహా ఇస్తున్నారు.

# పైనాపిల్ తింటే గర్భిణి స్త్రీలకు ప్రమాదామా..?



గర్భధారణ సమయంలో పైనాపిల్ తినడం సురక్షితమా కాదా అనే ప్రశ్న చాలా మంది గర్భిణీ స్త్రీల మనసులో ఉంటుంది. పైనాపిల్‌లో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ గర్భాశయ సంకోచాలను ప్రేరేపిస్తుందని, దీని వల్ల గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉందని చాలా మంది నమ్ముతారు. అయితే, ఈ నమ్మకం ఎంతవరకు నిజం? పైనాపిల్ గురించి తెలుసుకోవలసిన విషయాలు పైనాపిల్‌లో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది మాంసాన్ని కరిగించే గుణం కలిగి ఉంటుంది. కొంతమంది ఈ ఎంజైమ్ గర్భాశయ కణజాలాన్ని కూడా కరిగించవచ్చు అని భావిస్తారు. పైనాపిల్ తినడం వల్ల గర్భస్రావం అయ్యే అవకాశం ఉందనే నమ్మకానికి శాస్త్రీయ ఆధారాలు చాలా తక్కువ. బ్రోమెలైన్ గర్భాశయ సంకోచాలను ప్రేరేపించవచ్చు అనేది నిజమే. కానీ, పైనాపిల్‌లో ఉండే బ్రోమెలైన్ మొత్తం గర్భాశయాన్ని సంకోచింపజేయడానికి సరిపోదు.గర్భస్రావానికి అనేక కారణాలు ఉంటాయి. వీటిలో హార్మోన్ల అసమతుల్యత, జన్యుపరమైన లోపాలు, గర్భాశయ సంక్రమణలు మొదలైనవి ఉన్నాయి. %జుఇజూవతీం జఱవషం టతీశీఎ జుఇజూశ్రీశీతీవ వీశీతీవ ానూశ్రీంశీ =ముఙ% బాలకృష్ణతో సినిమాలు చేయకు..హీరోయిన్‌కు భర్త కండిషన్..? నిపుణులు ఏమి చెబుతున్నారు? చాలా మంది నిపుణులు పైనాపిల్‌ను మితంగా తీసుకోవడం గర్భధారణ సమయంలో సురక్షితమే అని చెబుతున్నారు. అయితే, ప్రతి గర్భధారణ భిన్నంగా ఉంటుంది కాబట్టి, పైనాపిల్ తినే ముందు మీ వైద్యునితో సంప్రదించడం మంచిది. ముఖ్యమైన అంశాలు పైనాపిల్‌ను మితంగా తీసుకోవడం ముఖ్యం. ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల అజీర్తి, గ్యాస్, హార్ట్ బర్న్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.మొదటి త్రైమాసికంలో పైనాపిల్ తినడం గురించి కొంతమంది నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఈ సమయంలో గర్భం బలహీనంగా ఉంటుంది.ఏదైనా ఆహారాన్ని గర్భధారణ సమయంలో తీసుకునే ముందు మీ వైద్యుని సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. చివరగా: పైనాపిల్ తినడం వల్ల గర్భస్రావం అయ్యే అవకాశం ఉందనే నమ్మకానికి శాస్త్రీయ ఆధారాలు చాలా తక్కువ. అయితే, ప్రతి గర్భధారణ భిన్నంగా ఉంటుంది కాబట్టి, పైనాపిల్ తినే ముందు మీ వైద్యునితో సంప్రదించడం మంచిది.

# జాదూ జడావు

ఫ్యాషన్ ప్రపంచంలో భారతదేశానికి చెందిన సంప్రదాయ దుస్తులు, నగలు ఎప్పుడూ ప్రత్యేకమే! మగువల మేనిపై మెరిసిపోయే ఆభరణాలకు మనదేశమే పుట్టినిల్లు. సంక్లిష్టమైన కళానైపుణ్యంతో రూపొందిన జడావు ఆభరణాలకు పూర్వం ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. రాచరికపు శోభను ఇనుమడింప జేసేలా రాళ్లను పొదిగే ప్రత్యేక నైపుణ్యాన్ని జడావు కళగా పిలిచేవారు. అలా రూపుదిద్దుకున్న ఆభరణాలు జడావు నగలుగా ప్రసిద్ధి. నేటికీ పెండ్లిళ్లు, పండుగలు లాంటి సంప్రదాయ వేడుకల్లో ఈ భారీ నగలను ధరిస్తున్నారు. పట్టుచీర మీదికైనా, లంగావోణీ, గాగ్రా పైకి కూడా ఇవి అందంగా నప్పుతాయి. ఇందులో భారీ కంఠాభరణాలు, చోకర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కెంపులు, వజ్రాలు, పచ్చలు, వైడూర్యాలు ఇలా విలువైన రత్నాలను ఎలాంటి జిగురు లేకుండా నగల ఆకృతుల్లో పొదగడమే కాకుండా, ఎలాంటి ఎనామిల్ ఫినిషింగ్ లేకుండా రూపొందించడమే జడావు నగల ప్రత్యేకత. తరాల కిందటి నగలను ఈ తరం మెచ్చే విధంగా రూపొందిస్తున్నారు డిజైనర్లు. రాళ్ల కాంబినేషన్‌లోనూ వైవిధ్యాన్ని చూపుతూ అతివల మనసు దోచేస్తున్నారు. ఈ తరహా నగలు బంగారంలోనే కాకుండా ఇమిటేషన్ జువెలరీగానూ అందుబాటులోకి వచ్చాయి. వన్‌గ్రామ్ గోల్డ్, ఆక్సిడైజ్డ్ సిల్వర్‌లోనూ ఇవి దొరుకుతున్నాయి. ఎందుకు ఆలస్యం.. మీరూ ఒకసారి ట్రై చేయండి.



# మార్కెట్

## ఆల్‌టైమ్ రికార్డ్.. రూ.లక్ష దాటిన బంగారం ధరలు

ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళు తున్నాయి. సంపన్నులకే దడ పుట్టించేలా ప్రస్తుతం బంగారం రేట్లు పెరుగుతూపోతున్నాయి. తాజాగా బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి తాకాయి. మంగళవారం దేశీయంగా 24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి ధర ఏకంగా రూ.లక్ష దాటింది. ఢిల్లీ (%ఱవశ్రీష్ట్రఱ%), ముంబై, కోల్‌కతా, చెన్నై సహా అన్ని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన ఒక గ్రాము బంగారం ధర రూ.10,000 పైనే పలుకుతోంది. అత్యధికంగా దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం ధర రూ.1,02,160కు చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన గ్రాము బంగారం ధర రూ.10,150గా ఉంది. నోయిడా, గురుగ్రామ్, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన గ్రాము బంగారం ధర రూ.10,135గా ఉంది. రానున్న రోజుల్లో తులం బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కరెన్సీ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలహీనపడటం, అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటం.. గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నది. స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను పసిడి వైపునకు మళ్లిస్తున్నారు. ఇక బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలతో కొనుగోలుదారుల నుంచి పెద్దగా గిరాకీ లేకున్నా.. జ్యుయెల్లర్స్, రిటైలర్స్ నుంచి డిమాండ్ కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే మార్కెట్‌లో పుత్తడి ధరలు దౌడు తీస్తున్నాయని మెజారిటీ నిపుణుల విశ్లేషణ. కాగా, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం చైనా మినహా మిగతా దేశాలపై ఆగినా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మాత్రం ఆ సెగ తగులుతూనే ఉన్నది. ఈ క్రమంలో ఆయా దేశాలతో జరుగుతున్న అమెరికా ట్రేడ్ డీల్స్‌నుబట్టి భవిష్యత్తులో బంగారం రేట్ల పెరుగుదలలో వేగం ఉంటుందని అంచనా వేస్తున్నారు.




# ఎకోరెన్‌పై అనుమానాలెన్నో!



**రూ.27వేల కోట్లతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంవోయూ**

**బాబు డైరెక్షన్‌లో ఈ సంస్థ తెలంగాణకు వచ్చినట్టు ప్రచారం**

**పదేండ్ల క్రితం మొదలైన సంస్థ భారీ పెట్టుబడి పెట్టగలదా?**

**ఎకోరెన్ ప్రమోటర్ లక్ష్మీప్రసాద్ బాబు అనుచరుడి బంధువే!**

రాష్ట్రంలో సోలార్ ప్లాంట్లు పెట్టేందుకు ఎకోరెన్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఏకంగా రూ.27 వేల కోట్లతో రేవంత్ సర్కారుతో ఒప్పందం కుదుర్చుకున్నది. పదేండ్ల క్రితమే మొదలైన ఈ సంస్థకు ఇంత భారీ పెట్టుబడులు పెట్టే సత్తావున్నదా? లేక షెల్ కంపెనీయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ సీఎం బాబు డైరెక్షన్‌లోనే ఒప్పందం కుదిరినట్టు తెలుస్తున్నది.

హైదరాబాద్ : రాష్ట్రంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇటీవల కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎకోరెన్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఏకంగా రూ.27 వేల కోట్ల పెట్టుబడుల పెట్టేందుకు ముందుకొచ్చింది. అసలీ ఈ కంపెనీ తెలంగాణకు ఎలా వచ్చింది? ఇంతటి భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే సత్తావున్నదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ సంబంధాలతో అడుగుపెట్టిందా..? లేక నిజంగానే ఈ కంపెనీకు అంత ఆర్థిక సత్తా ఉందా? ఇదేమైనా డొల్ల కంపెనీయా..? అని విద్యుత్తు రంగ నిపుణులు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో రూ.27 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవలే ఎకోరెన్ ఇండియా ఎనర్జీ లిమిటెడ్.. టీజీ రెడ్‌కోతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 3,279 మెగావాట్ల విండ్ %–% సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్ట్‌తోపాటు 1,650 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్స్, 650 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

**బాబు డైరెక్షన్‌లోనేనా.**

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరగానే ఎకోరెన్ ఎనర్జీ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు జెట్ స్పీడ్‌తో ఆగమేఘాల మీద అనుమతులొచ్చాయి. శ్రీ సత్యసాయి అనంతపురం జిల్లాల్లో రూ.1,600 కోట్లకు పైగా పెట్టుబడులకు ఏపీ సర్కారు గ్రీన్ సిగ్నలిచ్చింది. ఈ కంపెనీ ప్రమోటర్ అయిన యెర్నేని లక్ష్మీప్రసాద్ డైరెక్టర్‌గా ఉన్న అనంతపూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కూడా ప్రభుత్వం రూ.970 కోట్ల పెట్టుబడులకు రెడ్‌కార్పెట్ పరిచింది. ఆ వెంటనే ఇదే సంస్థ రూ.27వేల కోట్లను పెట్టుబడి పెడతామని తెలంగాణకు వచ్చింది. వాస్తవానికి ఈ సంస్థ 2010లో ఏర్పాటైనట్టు తెలుస్తున్నది. ఇంత తక్కువ వ్యవధిలో అంత టర్నోవర్ ఎలా సాధించిందన్న దానిపై అనుమానాలొస్తున్నాయి. ఎకోరెన్ అనుబంధ సంస్థ అయిన బోరియాస్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మధ్య తలెత్తిన వివాదం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వద్దకు చేరింది. కర్ణాటకలోని బళ్లారిలో 175 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటుచేసిన సంస్థ రూ.2.77కు యూనిట్ చొప్పున సరఫరా చేస్తామన్నది. 2020 డిసెంబర్ వరకు పూర్తిచేయాల్సి ఉండగా, నిర్మాణం పూర్తికాలేదు. దీంతో వివాదానికి దారితీసింది.

**పొలిటికల్ లింకుతోనేనా..**

ఏకోరెన్ ఎనర్జీ ఇండియా సంస్థ వ్యవస్థాపకులైన యెర్నేని లక్ష్మీప్రసాద్ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన లింగమనేని రమేశ్‌కు సమీప బంధువట. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబుకున్న పొలిటికల్ లింకులతోనే ఎకోరెన్ తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నదా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

# దేశీయ స్టాక్ మార్కెట్స్‌లో లాభాల జోష్..

## వరుసగా ఐదో సెషన్‌లోనూ బుల్ జోరు

దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోష్ కొనసాగుతోంది. గత నాలుగు సెషన్‌లలో లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు ఇవాళ ఐదో సెషన్‌లో కూడా లాభాలు మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు కనిపిస్తున్నప్పటికీ, భారతీయ సూచీలు ఫుల్ జోష్‌లో ట్రేడయ్యాయి. అమెరికా టారిఫ్‌లపై ఉన్న ఆందోళనలు తగ్గుముఖం పట్టడంతో మార్కెట్‌కు ఊరట లభించింది. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాంటి ప్రముఖ బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో బ్యాంక్ నిఫ్టీ చరిత్రలోనే గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దాంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 855.30 పాయింట్ల లాభంతో 79,408 వద్ద ముగిసింది. అంటే 1.09 శాతం లాభపడింది. అదేవిధంగా నిఫ్టీ సైతం 273.90 (1.15 శాతం) పాయింట్ల లాభంతో 24,125 వద్దకు సెటిలైంది. మొత్తంగా చూస్తే 2,829 షేర్లు లాభపడగా, 1093 షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. ఇంకో 149 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ఉన్నాయి.

ది క్రైమ్ న్యూస్ Crime News
తెలుగు దినపత్రిక
సోమవారం - 06 - ఏప్రిల్ - 2026


# గాలి కాలుష్యంతో బ్రెయిన్ స్ట్రోక్

బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని గాలి కాలుష్యం పెంచుతున్నది. ఏటా లక్షల మంది ప్రాణాలను తీస్తున్నదని 2024 బయోమెడ్ సెంట్రల్ (బీఎంసీ) పబ్లిక్ హెల్త్ అధ్యయనం వెల్లడించింది. వాయు కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఇరవై లక్షల మంది స్ట్రోక్ బారిన పడుతున్నట్లు ఈ సర్వే తేల్చింది. భారతదేశంతో సహా తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో సంభవించే నాలుగు బ్రెయిన్ స్ట్రోక్ మరణాలలో.. ఒకటి గాలి కాలుష్యం వల్లేనని కనుగొన్నది. ముఖ్యంగా.. నగరాలు, పట్టణ ప్రాంత యువకులు ఎక్కువగా దీని బారిన పడుతున్నట్లు వెల్లడైంది. పీఎం 2.5 వంటి సూక్ష్మ కణాలు.. ఊపిరితిత్తుల రక్షణ వ్యవస్థను దాటుకొని రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తున్నాయట. రక్త నాళాల్లో అడ్డంకులు సృష్టించి.. బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణం అవుతున్నాయని అధ్యయనకారులు చెబుతున్నారు. మన దేశంలో మూడు దశాబ్దాలుగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. గాలి కాలుష్యం వల్ల స్ట్రోక్ బారిన పడుతున్నవారిలో యువతే ఎక్కువగా ఉంటున్నదట. దాదాపు 20-30 శాతం స్ట్రోక్‌లు 50 ఏళ్లలోపు వారిలోనే సంభవిస్తున్నాయట. వీరిలో ప్రాణాలతో బయటపడిన వారిలో 50 శాతం మంది శాశ్వత వైకల్యాలతో మిగిలిపోతున్నారట. ఈ పరిస్థితిని తప్పించుకోవాలంటే.. ఆకస్మికంగా బలహీనమవ్వడం, మాటలు తడబడటం, ముఖం వాలిపోవడం, శరీరం సమతుల్యత కోల్పోవడం



లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. ఇక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడంతోపాటు ధూమపానం మానేయడం, చురుకైన జీవనశైలి, గాలి కాలుష్యానికి దూరంగా ఉండటం, ఎయిర్ ప్యూరిఫైయర్‌లను ఉపయోగించడం వల్ల స్ట్రోక్ ప్రమాదం నుంచి బయట పడొచ్చని చెబుతున్నారు.

# 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు కచ్చితంగా రోజూ వీటిని తినాలి.. వృద్ధాప్యంలో ఎంతో మేలు జరుగుతుంది..!



సాధారణంగా యుక్త వయస్సులో ఉన్నప్పుడు ఎలాంటి ఆహారం తీసుకున్నా సరే వయస్సు మీద పడుతున్న కొద్దీ కచ్చితంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే శరీరంపై తీవ్ర దుష్ప్రభావాలు ఉంటాయి. అనేక వ్యాధులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. చిన్నతనంలో సహజంగానే చాలా మంది చిరుతిళ్లను ఎక్కువగా తింటారు. కాస్త వయస్సు పెరిగిన తరువాత ఆ తిండి తగ్గుతుంది. కానీ వయస్సు మీద పడుతున్న తరువాత కూడి చిరు తిండిని తినడం శ్రేయస్కరం కాదు. ముఖ్యంగా 40 ఏళ్లకు పైబడిన వారు తమ ఆరోగ్యం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. ప్రధానంగా తినే ఆహారం విషయంలో అసలు నిర్లక్ష్యం చేయకూడదు. ఆహారం పట్ల అశ్రద్ధ చేస్తే డయాబెటిస్, గుండె జబ్బులు, క్యాన్సర్, కీళ్ల నొప్పులు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. కనుక 40 ఏళ్లకు పైబడిన తరువాత జంక్ ఫుడ్‌కు పూర్తిగా స్వస్తి చెప్పి ఆరోగ్యకరమైన ఆహారాలను తినాల్సి ఉంటుంది.

## టమాటాలు, చిలగడదుంపలు..

40 ఏళ్లకు పైబడిన వారు రోజూ తినాల్సిన ఆహారాల్లో టమాటాలు కూడా ఒకటి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది కెరోటినాయిడ్స్ జాబితాకు చెందుతుంది. దీని వల్లే టమాటాలు ఎరుపు రంగులో ఉంటాయి. టమాటాలను తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ముప్పు గణనీయంగా తగ్గుతుంది. టమాటాలను రోజూ సూప్ లేదా జ్యూస్ రూపంలో తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. వయస్సు మీద పడుతున్న వారికి సహజంగానే కంటి చూపు మందగిస్తుంది. అలాగే బీపీ పెరుగుతుంది. ఈ సమస్యలు రాకుండా అడ్డుకోవాలంటే చిలగడదుంపలను తరచూ తినాలి. వీటిల్లో పొటాషియం, బీటా కెరోటిన్, ఫైటో కెమికల్స్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీ పెరగకుండా చూస్తాయి. అలాగే కంటి చూపును మెరుగు పరుస్తాయి. కళ్లను రక్షిస్తాయి.

## కోడిగుడ్లు, పుట్ట గొడుగులు..

40 ఏళ్లకు పైబడిన వారు రోజూ ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తింటుంటే మేలు జరుగుతుంది. గుడ్డులోని పసుపు సొన తీసేసి కేవలం తెల్ల సొనను మాత్రమే తింటుండాలి. దీని వల్ల ప్రోటీన్లు అధికంగా లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. వీటి వల్ల ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శరీర నిర్మాణానికి ప్రోటీన్లు దోహదం చేస్తాయి. ఎముకలకు బలాన్ని అందిస్తాయి. వీటి వల్ల కండరాల నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. 40 ఏళ్లకు పైబడిన వారు వారంలో రెండు సార్లు పుట్ట గొడుగులను తింటుంటే మేలు జరుగుతుంది. వీటి వల్ల క్యాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా లభిస్తాయి. అలాగే మెదడు పనితీరు మెరుగు పడుతుంది. యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది.

## యాపిల్ పండ్లు, బాదంపప్పు..

40 ఏళ్లకు పైబడిన వారు రోజూ ఒక యాపిల్‌ను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల కొలెస్ట్రాల్, బీపీ నియంత్రణలో ఉంటాయి. గుండె పనితీరు మెరుగు పడుతుంది. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అలాగే జీర్ణ సంబంధిత సమస్యలు ఉండవు. అజీర్తి, గ్యాస్, మలబద్దకం వంటివి తగ్గుతాయి. యాపిల్ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. దీని వల్ల క్యాన్సర్లు రాకుండా చూసుకోవచ్చు. 40 ఏళ్లకు పైబడిన వారు నిత్యం గుప్పెడు బాదంపప్పును నీటిలో నానబెట్టి తింటుండాలి. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. కీళ్ల నొప్పులు, వాపులు రాకుండా చూసుకోవచ్చు. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా 40 ఏళ్లకు పైబడిన స్త్రీలు, పురుషులు ఆయా ఆహారాలను రోజూ తింటుంటే వృద్ధాప్యంలో ఎలాంటి రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# కాలి మడమల నొప్పులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయా..? అయితే ఈ చిట్కాలను పాటించండి..!



శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువ సమయం పాటు చేస్తే ఎవరికైనా సరే సహజంగానే ఒళ్లు నొప్పులు వస్తుంటాయి. అయితే కొందరికి వీటితోపాటు కాలి మడమలు కూడా నొప్పిగా ఉంటాయి. కాలి మడమల నొప్పి వచ్చేందుకు ఇంకా అనేక కారణాలు ఉంటాయి. ఎక్కువ సేపు నిలబడి ఉన్నా, హై హీల్స్ ధరించే మహిళల్లో, శరీరంలో క్యాల్షియం లోపించడం, వ్యాయామం అసలు చేయకపోవడం, పోషకాల లోపం వంటి కారణాల వల్ల కూడా కాలి మడమల నొప్పులు వస్తుంటాయి. అయితే ఇవి సాధారణంగా వాటంతట అవే తగ్గిపోతాయి. కానీ కొన్ని సందర్భాల్లో నొప్పి మరీ ఇబ్బందులకు గురి చేస్తుంది. ఒక పట్టాన తగ్గదు. అలాంటప్పుడు చాలా మంది పెయిన్ కిల్లర్స్ ఉపయోగిస్తారు. ఇవి ఆరోగ్యానికి ఏమాత్రం మంచివి కావు. కిడ్నీలపై భారం పడేలా చేస్తాయి. కనుక సహజసిద్ధమైన చిట్కాలను పాటించాల్సి ఉంటుంది. వీటి వల్ల కాలి మడమల నొప్పులతోపాటు ఒళ్లు నొప్పులను సైతం సులభంగా తగ్గించుకోవచ్చు.

## అల్లం నీళ్లు..

ఒక పాత్రలో తగినంత నీటిని తీసుకుని అందులో కొన్ని అల్లం ముక్కలను వేసి బాగా మరిగించాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని వడకట్టి తాగాలి. దీని వల్ల మడమల నొప్పులు వెంటనే తగ్గుతాయి. ఆ నొప్పుల నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. అల్లంలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు అన్ని రకాల నొప్పులను తగ్గేలా చేస్తాయి. ఈ మిశ్రమాన్ని రోజుకు 2 సార్లు ఒక కప్పు మోతాదులో తాగాల్సి ఉంటుంది. దీంతో ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే ముఖాన్ని నీటితో శుభ్రం చేసుకుని బాగా నీటిని తాగాలి. తరువాత కాళ్లను 5 నిమిషాల పాటు వేడి నీటిలో ఉంచాలి. అనంతరం మరో 3 నిమిషాల పాటు చల్లని నీటిలో ఉంచాలి. ఇలా 3 సార్లు చేయాలి. దీంతో మడమల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ చిట్కా నొప్పులకు అద్భుతంగా పనిచేస్తుంది.

## లవంగం నూనె..

ఇక నొప్పులను తగ్గించడంలో లవంగ నూనె అద్భుతంగా పనిచేస్తుంది. మడమలపై లవంగనూనె బాగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల నొప్పుల నుంచి వెంటనే ఉపశమనం లభిస్తుంది. మనకు లవంగం నూనె మార్కెట్‌లో లభిస్తుంది. లేదా ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్‌లపై కూడా దీన్ని కొనుగోలు చేయవచ్చు. అలాగే కాలి మడమలు, ఒళ్లు నొప్పులు ఉన్నవారు పలు ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల కూడా ఈ నొప్పులను తగ్గించుకోవచ్చు. అందుకు గాను ఆలుగడ్డలు,కీరదోస, ఉసిరికాయలు, టమాటా, పచ్చి బొప్పాయి, క్యాబేజీ, కాలిఫ్లవర్ వంటి ఆహారాలు మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. ఈ ఆహారాల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు నొప్పులను తగ్గిస్తాయి.

## ఆవ గింజల పొడి..

కాలి మడమల నొప్పులు తగ్గాలంటే ఆవ గింజలు కూడా బాగానే పనిచేస్తాయి. కొన్ని ఆవ గింజలను తీసుకుని మెత్తని పొడిలా మార్చాలి. అనంతరం ఒక బకెట్‌లో వేడి నీటిని తీసుకుని అందులో ముందుగా సిద్ధం చేసిన ఆవ గింజల పొడి వేసి బాగా కలపాలి. అనంతరం ఆ బకెట్‌లో కాళ్లను ఉంచాలి. కాళ్ల మడమలు బాగా మునిగేలా కాళ్లను బకెట్ లో పెట్టాలి. ఇలా 15 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేస్తున్నా కూడా కాలి మడమల నొప్పులను తగ్గించుకోవచ్చు. అలాగే ఆవ గింజల పొడికి బదులుగా రాక్ సాల్ట్ ను కూడా ఉపయోగించవచ్చు. అర బకెట్ వేడి నీటిలో రాక్ సాల్ట్ వేసి కలిపి అనంతరం ఆ నీటిలో కాళ్లను ఉంచాలి. 15 నిమిషాల పాటు కాళ్లను ఉంచి తీసేయాలి. దీని వల్ల కూడా నొప్పులు తగ్గిపోతాయి. అలాగే రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపు, తేనె కలిపి తాగుతున్నా కూడా ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. పసుపులో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు అన్ని రకాల నొప్పులను తగ్గించడంలో సహాయం చేస్తాయి. ఇలా ఈ చిట్కాలను పాటిస్తుంటే కాలి మడమల నొప్పులను సమర్థవంతంగా తగ్గించుకోవచ్చు.

# చర్మ సమస్యలు పోవాలంటే...




వర్షాకాలంలో సహజంగానే అనారోగ్య సమస్యలు ఎక్కువ. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధులు చుట్టుముడుతుంటాయి. మరోవైపు చర్మ సంబంధిత సమస్యలు కూడా ఎక్కువగా ఉంటాయి. వర్షపు నీరు, ఉక్కపోత, చెమట కారణంగా చర్మంపై దద్దుర్లు, దురద ప్రధానంగా కన్పిస్తుంటుంది. అయితే కొన్ని వంటింటి చిట్కాలతో సులభంగానే ఈ సమస్యల్నించి గట్టెక్కవచ్చంటున్నారు చర్మ వైద్య నిపుణులు. స్నానానికి ముందు ఒక స్పూన్ బేకింగ్ సోడాలో నిమ్మరసం పిండుకుని మిశ్రమంగా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్నానానికి ముందు మొత్తం శరీరానికి మర్దనా చేసి 15-20 నిమిషాలుంచాలి. ఆ తరువాత స్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల దురద సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. ఒక గిన్నెలో వేడి నీళ్లు తీసుకొని అందులో వేపాకులు వేయాలి. ఆ నీళ్లను స్నానం చేసే నీళ్లల్లో కలుపుకుని స్నానం చేయాలి. ఇలా వారానికి 3 సార్లు చేస్తే దురద సమస్యల్నించి గట్టెక్కవచ్చు. చర్మ సంబంధిత సమస్యల్ని దూరం చేసేందుకు కొబ్బరి నూనె అద్భుతమైన ఔషధంగా చెప్పవచ్చు. సీజన్‌తో సంబంధం లేకుండా ఎప్పుడైనా స్నానానికి ముందు కొబ్బరినూనెను శరీరానికి మర్దన చేసుకుంటే చర్మానికి పోషక గుణాలు అందించడమే కాకుండా ఇన్‌ఫెక్షన్ నుంచి దూరం చేస్తుంది.

# రాత్రి పూట నిద్రించడానికి ముందు బాదంపప్పును తిని పాలను తాగండి.. ఎన్నో లాభాలు ఉంటాయి..!



ఆరోగ్యకరమైన పోషకాహారాల్లో బాదంపప్పులు ఎల్లప్పుడూ ముందుంటాయి. ఆరోగ్యకరమైన ఆహారాలు అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చే పేర్లలో బాదంపప్పు కూడా ఒకటి. బాదంపప్పు అనేక పోషకాలను కలిగి ఉంటుంది. ఈ పప్పును రోజూ తింటుంటే అనేక లాభాలను అందిస్తుంది. ఈ క్రమంలోనే బాదంపప్పును రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు, వైద్యులు కూడా సూచిస్తుంటారు. అయితే బాదంపప్పును రాత్రి పూట నిద్రకు ముందు తింటే ఎంతగానో మేలు జరుగుతుంది. ముఖ్యంగా 7 లేదా 8 బాదంపప్పులు రాత్రి పూట నిద్రకు ముందు తినాలి. అనంతరం ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలను తాగాలి. ఇలా రోజూ చేస్తుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

## మానసిక ఆరోగ్యానికి..

రోజూ రాత్రి పూట బాదంపప్పును తిని పాలను తాగడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్ర లేమి తగ్గుతుంది. మానసిక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. బాదంపప్పులో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాలను ప్రశాంతంగా మారుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు బాదంపప్పు తిని పాలను తాగడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. ఆ సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. దీని వల్ల నిద్రకు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా ఉంటుంది.

## ఎముకల దృఢత్వానికి..

బాదంపప్పులను తిని పాలను తాగితే శరీరంలో మెలటోనిన్ శాతం పెరుగుతుంది. దీని వల్ల నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే మరుసటి రోజు ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. బద్ధకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. ఈ రెండింటిలోనూ క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. కనుక ఈ రెండింటినీ రోజూ తీసుకుంటే ఎముకలు, దంతాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. ఎముకలు నిర్మాణమవుతాయి. దంతాల నొప్పి తగ్గిపోతుంది. ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల విటమిన్ ఇ అధికంగా లభిస్తుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తుంది. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. దీని వల్ల మెదడు కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది.

## గుండె ఆరోగ్యానికి..

ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకుంటే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. వీటి వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు లభించి షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అయితే రాత్రి పూట నిద్రించడానికి కనీసం 30 నిమిషాల ముందు బాదంపప్పును తిని అనంతరం పాలను తాగాల్సి ఉంటుంది. పాలు అంటే అలర్జీ ఉన్నవారు సోయా పాలను తాగవచ్చు. గేద పాల కన్నా ఆవు పాలను ఇలా తాగుతుంటే ఇంకా ఎంతగానో మేలు జరుగుతుంది. ఇలా బాదంపప్పు, పాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# ఈ మసాలా దినుసులను తరచూ తీసుకోండి.. మీ శరీర రోగ నిరోధక శక్తి ఎప్పటికీ తగ్గదు..!

సీజన్లు మారినప్పుడు లేదా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు వస్తుంటాయి. గొంతు, ఊపిరితిత్తులు, శ్వాస నాళాల్లో కఫం చేరుతుంది. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. అయితే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉన్నవారికి ఈ సమస్యల తీవ్రత తక్కువగానే ఉంటుంది కానీ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే మాత్రం ఈ సమస్యలు మరింత ఇబ్బందులకు గురి చేస్తాయి. అలాగే ఫ్లూ, ఆస్తమా, బ్రాంకైటిస్, జ్వరం వంటి సమస్యలు కూడా వస్తాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తరచూ అనారోగ్యాల బారిన పడుతుంటారు. ఒక పట్టాన తగ్గవు. కానీ మన ఇంట్లో ఉండే పలు మసాలా దినుసులను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే రోగ నిరోధక శక్తిని ఎల్లప్పుడూ ఎక్కువగా ఉండేలా చేసుకోవచ్చు. దీంతో అనేక రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

## ఇంగువ, పసుపు..

మన వంట ఇంటి పదార్థాల్లో ఇంగువ కూడా ఒకటి. దీన్ని కొందరు తరచూ వంటల్లో వేస్తుంటారు. ఇది అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఇంగువలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ బయోటిక్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. రోజూ వంటల్లో ఇంగువను వేసి వాడితే ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇమ్యూనిటీ పవర్ ఎల్లవేళలా ఎక్కువగా ఉంటుంది. రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే పసుపును కూడా మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. ఇది కూడా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. రోజూ రాత్రి పూట పాలలో పసుపు కలిపి తాగాలి. లేదా పసుపును గోరు వెచ్చని నీటిలో కలిపి కూడా తాగవచ్చు. పసుపు వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకోవచ్చు.

## మిరియాలు, లవంగాలు..

మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచడంలో మిరియాలు కూడా అద్భుతంగా పనిచేస్తాయి. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఇవి వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను నయం చేస్తాయి. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. రోజూ రాత్రి గోరు వెచ్చని పాలలో మిరియాల పొడి కలిపి తాగుతుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే వంట ఇంటి మసాలా దినుసుల్లో ఒకటైన లవంగాలు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. వ్యాధుల నుంచి రక్షిస్తాయి. రోజూ రాత్రి పూట ఒకటి లేదా రెండు లవంగాలను తిని గోరు వెచ్చని పాలు లేదా నీళ్లను తాగుతుంటే ఉపయోగం ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

## మెంతులు..

మెంతులను కూడా మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తాం. ఇవి కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్‌ను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అలాగే వీటిని తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. రోజూ రాత్రి పూట మెంతులను నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని తినాలి. ఇలా చేస్తుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మెంతులను నేరుగా తినలేకపోతే మెంతుల పొడిని మజ్జిగలో లేదా గోరు వెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. ఇలా చేస్తున్నా కూడా ఉపయోగం ఉంటుంది.

## దాల్చిన చెక్క..

ఇక వంట ఇంటి మసాలా దినుసుల్లో ఒకటైన దాల్చిన చెక్క కూడా మనకు మేలు చేస్తుంది. ఇందులో మాంగనీస్, క్యాల్షియం, ఫైబర్, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇందులో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కనుక దీన్ని రోజూ తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. దాల్చిన చెక్క పొడిని మీరు తినే ఆహారాలపై చల్లి తీసుకోవచ్చు. లేదా గోరు వెచ్చని పాలు, నీటిలో కలిపి కూడా తాగవచ్చు. దీంతో ఎంతగానో ఉపయోగం ఉంటుంది. ఇలా ఆయా మసాలా దినుసులు, వంట ఇంటి పదార్థాలు మన రోగ నిరోధక శక్తిని పెంచడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. కనుక వీటిని తరచూ తీసుకోవాలి.



## గల్లంతైన అమెరికన్ పైలట్ ను కాపాడిన భద్రతా దళాలు




వాషింగ్టన్/టెహ్రాన్: ఇరాన్ గగనతలంలో కూలిపోయిన ఎఫ్-15ఈ (ఫీ-15జు) యుద్ధ విమానానికి సంబంధించి గత 36 గంటలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. గల్లంతైన అమెరికన్ పైలట్ ఆచూకీ లభించడమే కాకుండా, అమెరికా భద్రతా దళాలు అతడిని రక్షించాయి. శుక్రవారం ఇరాన్ దళాలు జరిపిన దాడిలో అమెరికాకు చెందిన ఫైటర్ జెట్ కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో విమానంలోని ఇద్దరు సిబ్బంది ఎజెక్ట్ అయ్యారు. ఒకరిని వెంటనే రక్షించినప్పటికీ, రెండో పైలట్ ఆచూకీ లభించలేదు. శత్రువుల కళ్లు గప్పి ఇరాన్ పర్వత ప్రాంతాల్లో దాక్కున్న ఆ పైలట్ కోసం అమెరికా సైన్యం డ్రోన్లు, హెలికాప్టర్లతో భారీ గాలింపు చేపట్టింది. మరోవైపు ఇరాన్ కూడా సదరు పైలట్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించింది. అయితే, ఇరాన్ సేనల కంటే ముందే అమెరికా స్పెషల్ ఫోర్స్ కమెండోలు పైలట్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అతడిని రక్షించాయి. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతోషం వ్యక్తం చేస్తూ, ఇది అమెరికా సైనిక చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ అని కొనియాడారు. ప్రస్తుతం ఆ పైలట్ సురక్షితంగా ఉన్నారని, స్వల్ప గాయాల నుంచి కోలుకుంటున్నారని అధికారులు వెల్లడించారు.

## భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు ఆరు శాతానికి తగ్గింపు





న్యూఢిల్లీ : మూడీస్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి అంచనాలను 6శాతానికి తగ్గించింది. గతేడాది ఆర్థిక వృద్ధి 6.8శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంతో వృద్ధి వేగం మందగిస్తోందని, ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉందని మూడీస్ పేర్కొంది. భారతదేశ క్రెడిట్ రేటింగ్స్‌పై నివేదికను మూడీస్ ఆదివారం విడుదల చేసింది. యుద్ధం కారణంగా దీర్ఘకాలిక అంతరాయాలు ముఖ్యంగా ఎల్‌పిజి రవాణా కారణంగా భవిష్యత్తులో గృహాలకు ఎల్‌పిజి కొరత, అధిక ఇంధన, రవాణా ఖర్చులకు అలాగే దిగుమతి చేసుకున్న ఎరువులపై భారత్ ఆధారపడటంతో ఆహార ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని పేర్కొంది. "పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా అధిక ధరలు, పెరిగిన ముడి సరుకుల వ్యయాల మధ్య ప్రైవేట్ వినియోగం క్షీణించడం, స్థూల స్థిర మూలధన నిర్మాణం బలహీనం కావడం భారతదేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం దృష్ట్యా 2026-27లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు గతంలో 6.8 స్థాయి నుండి తగ్గి 6శాతానికి పరిమితమవుతుందని అంచనావేస్తున్నాం" అని మూడీస్ నేవిక తెలిపింది. "ప్రస్తుతం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నప్పటికీ.. భౌగోళిక, రాజకీయ ఇబ్బందులు ద్రవ్యోల్బణ అంచనాలను పెరుగుదల దిశగా మళ్లించాయి" అని మూడీస్ పేర్కొంది. 2026 ఆర్థిక సంవత్సరంలో 2.4శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2027లో సగటున 4.8శాతానికి చేరుకుంటుందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణ ముప్పు తలెత్తడం, వృద్ధి బలంగా కొనసాగడంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో పాలసీ రేట్లు స్థిరంగా కొసాగవచ్చు లేదా క్రమంగా పెరగవచ్చు అని పేర్కొంది. పెరిగిన చమురు, గ్యాస్, ఎరువల ధరలు నిర్దేశిత సబ్సిడీపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తాయని, ఫలితంగా బడ్జెట్‌తో పోలిస్తే రాబడి క్షీణతతో పాటు అధిక వ్యయాలకు దారితీయవచ్చని పేర్కొంది.

## హోర్మూజ్ జలసంధిని దాటిన మరో భారత నౌక 'గ్రీన్ ఆశా'




టెహ్రాన్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తల నడుమ మరో భారత జెండాతో ఉన్న ఎల్‌పిజి నౌక 'గ్రీన్ ఆశా' హోర్మూజ్ జలసంధిని దాటింది. ఈ ప్రాంతంలో సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఈ కీలక సముద్ర మార్గాన్ని దాటిన తొమ్మిదో భారత ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం హోర్మూజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. గ్రీన్ ఆశా కంటే ముందు బిడబ్ల్యూ టైర్, బిడబ్ల్యూ ఎల్మ్ అనే రెండు ఎల్‌పిజి నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను రవాణా చేశాయి. మార్చి నెలలో ఎంటి శివాలిక్, ఎంటి నందా దేవి అనే ట్యాంకర్లు 92,700 టన్నుల ఎల్‌పిజిని గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులకు చేర్చాయి. ముడి చమురు, ఇతర ఇంధన నౌకలు కూడా ఈ మార్గంలో ప్రయాణించాయి. 'జగ్ లాడ్కి' అనే ఆయిల్ ట్యాంకర్ యుఎఇ నుండి 80,000 టన్నుల ముడి చమురును ముంద్రా పోర్టుకు తీసుకురాగా, 'జగ్ ప్రకాశ్' నౌక ఒమన్ నుంచి ఆఫ్రికా మార్కెట్లకు గ్యాసోలిన్‌ను చేరవేసింది.

## నెక్ట్స్-జనరేషన్ అమృత్ భారత్ శాంపిల్ కోచ్ అదరహో



న్యూఢిల్లీ: నెక్ట్స్-జనరేషన్ అమృత్ భారత్ కోచ్‌ల అంతర్గత భాగాల అప్‌గ్రేడేషన్ జరుగుతోంది. శాంపిల్ కోచ్ సిద్ధమైంది. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా న్యూఢిల్లీ స్టేషన్‌లో ప్రతిపాదిత అంతర్గత డిజైన్, రంగులతో అభివృద్ధి చేసిన నెక్ట్స్-జనరేషన్ అమృత్ భారత్ కోచ్‌ల శాంపిల్ కోచ్‌ను పరిశీలించారు. ప్రయాణికులకు మంచి సౌకర్యం, ఆకట్టుకునే రూపం, మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ మోడల్ కోచ్‌ను రూపకల్పన చేశారు. పీవీసీ ఫ్లోరింగ్, సీటు, బెర్త్ రెక్సిన్, స్నాక్ టేబుళ్లు, కర్టెన్లు, లావేటరీ ప్రాంతాలు వంటి ముఖ్య భాగాల్లో వాటికి తగ్గ రంగులతో ప్రత్యేక అంతర్గత రంగుల థీమ్‌లు ఏర్పాటు చేశారు. ఈ కోచ్‌లలో వాడిన అన్ని పదార్థాలు హెచ్‌ఎల్ 3 అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా భద్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి. హెచ్‌ఎల్3 (హజార్డ్ లెవల్ 3) యూరోపియన్ రైల్వే స్టాండర్డ్ ఈఎన్ 45545-2కి అనుగుణంగా వీటి రూపకల్పన చేస్తున్నారు. హజార్డ్ లెవల్ 3 అంటే అగ్ని ప్రమాదంలో పదార్థాల భద్రత స్థాయి కొలిచే అత్యున్నత ప్రమాణం. ఈఎన్ 45545-2 అంటే యూరోపియన్ రైల్వే అగ్ని భద్రత ప్రమాణాల నియమావళి. ఈ రైళ్లకు వాడుతున్న ఈ కలర్ స్కీమ్ ఆధునిక రూపాన్ని ఇస్తూ దీర్ఘకాలికంగా మన్నికగా ఉండేలా చేస్తుంది. నిర్వహణ కూడా సులభతరంగా ఉంటుంది. రైల్వేలో ఉపయోగించే అన్ని రకాల బోగీలు, లోకోమోటివ్‌లను ఆధునీకీకరించారు. ఈ సూపర్‌ఫాస్ట్ ప్రయాణికుల రైలులో పీవీసీ ఫ్లోరింగ్ నుంచి రెక్సిన్ సీటు బెర్త్‌లు, స్నాక్ టేబుళ్లు, కర్టెన్లు, మరుగుదొడ్డి వరకు వాటికి తగ్గ రంగుల ప్యాలెట్‌లు వేయడంతో ఈ రైలు చూడగానే ఆకట్టుకుంటోందది. ప్రయాణికుల భద్రత, మెరుగైన సౌకర్యాల కోసం కొత్త డిజైన్‌లు, మెరుగైన మరుగుదొడ్డి సౌకర్యాలతో కోచ్‌ల శాంపిల్స్ సిద్ధం చేశామని, ఉన్న కోచ్‌ను మెరుగుపరచి నమూనా కోచ్‌గా తయారు చేశామని అశ్విని వైష్ణవ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# మరణములో నుండి జీవములోనికి



## ఈస్టర్ స్పెషల్

దేవుడు తన బలాతిశయము చేత క్రీస్తును మృతులలో నుండి లేపాడు (ఎఫెసీ 1:20,21). అన్నదే విశ్వసించదగ్గ అపొస్తలుల సువార్త సంబంధిత బోధయై ఉంది. సత్యవాక్యమను రక్షణ సువార్తగా కూడా ఇది ఉంది. లేచాడు అన్నది సువార్త కాదు. సర్వశక్తి సంపన్నుడైన అద్వితీయ సత్య దేవుని చేత యేసు మృతులలో నుండి సజీవంగా లేపబడ్డాడు అనునదే లేఖనానుసార సత్య సువార్త. తండ్రికి విలువిచ్చే క్రీస్తు అపార విధేయతను ఇదే ఘనంగా చాటుతుందనుటలో ఎలాంటి సందేహం అవసరం లేదు. 'వాక్యము నీ వద్దను, నీ నోటను, నీ హృదయములోను ఉన్నది. అది మేము ప్రకటించు విశ్వాస వాక్యమే. అదేమనగా -- యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు' (రోమా 10: 8--10). యేసు సజీవుడుగు దేవుని కుమారుడైన క్రీస్తు అనేది అపొస్తలుల అమూల్య విశ్వాసం. దేవుని కుమారుడు అంటే ఆయన ఆత్మ సంబంధ ఇశ్రాయేలీయుల రాజు అని అర్థం. యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని నమ్ముతూ ఆయన నామమందు జీవము పొందాలి అన్నదే ప్రతి ఒక్కరి ఆత్మ సంబంధ విజయానికి మూలం. ఈ లోకం మీద విజయం యేసు దేవుని కుమారుడు అనుటలోను , ఆయన్ను దేవ దేవుడు ఈ లోకానికి శరీరధారిగా పంపాడని విశ్వసించుటలోనే విజయం దాగి ఉంది (1యోహాను 5:5 ). మరి క్రీస్తు విజయానికి మూలం ఎక్కడ అన్నది లోతుగా పరిశీలన చేస్తే అది ఒక్క ఆయన విధేయతే అనేది బహు తేటగా వెల్లడవుతూ ఉందన్నది ఆశ్చర్యకర విశేషం. ఆజ్ఞలకు లోబడి పాపం చేయకపోవడం ద్వారా పరిశుద్ధత, దాని విధేయత ఈ రెండూ ఎప్పుడు నిలుపుకొనే వేకువ ప్రార్థనలతో అవిశ్రాంత విన్నపాలతో క్రీస్తు అసాధారణ విజయుడిగా, జగజ్జేతగా చరిత్రకెక్కాడు. దేవుడు తనకు అత్యంత విధేయుడైన తన కుమారుడను మరణంలో నుండి జీవములోనికి దాటించాడు. మరణంలోనుండి జీవములోనికి రావడం, పునరుత్థానం చెందడం ఇలా యేసు మరణాన్ని జయించడం దేవుని గొప్ప సంకల్పం. అయితే తనను మరణం నుండి రక్షింపగల తండ్రియైన దేవునికి ప్రార్థనలు, యాచనలు సమర్పించినందున యేసు అంగీకరించబడ్డాడనేది ఇదే ఆయన సాహసోపేత విజయానికి మూలం అయ్యింది. ఇక్కడ మరణం అంటే సిలువ మరణం కాదు, ఆత్మ సంబంధ మరణం. యేసుకు సిలువ మరణం తప్పదు. ఎందుకంటే ఇది దేవుని సంకల్పం. ఆయన మరి ఎలాంటి మరణం మీద గురిపెట్టి విజయం సాధించాలనుకున్నాడు అన్నది చూస్తే అదే ఆత్మ సంబంధ మరణం. ఆయన పరిశుద్ధుడు గనుక మరణం ఆయన మీద ఏలుబడి చేయుటకు అన్ని కోణాల్లో అన్ని దారులు వెదకి అది బాగా అలసిపోయింది. పారదర్శకంగా పరిశుద్ధ జీవితం ఆచరించి చూపుతూ యేసు మరణానికి సంపూర్తిగా తలవంచాడు. అంతే, మరణం ఆయన ముందు తలవంచి మోకరిల్లి సాగిలపడింది.

### మతంతో సంబంధం లేని మార్గం

మన తోటి ఇరుగు పొరుగు వాని చుట్టూరా ఉన్న సమాజం మేలుకై ప్రతి పని, పరిచర్య, సేవా విధానం శుద్ధ హృదయంతో ఆచరించుట ద్వారానే దేవుని మెప్పు పొందగలం. నిత్య సత్య జీవమనే క్రీస్తు మార్గం మతంతో ఎలాంటి సంబంధం లేనిది. ఇదొక ఆత్మ సంబంధ అసాధారణ ఆధ్యాత్మిక జీవన విధానం. ఇందులో వ్యక్తిగతమైన స్వయం స్వశక్తితో కూడిన పాప నివారణ సంబంధిత పరిశుద్ధ అభ్యాస ప్రయత్నాలు మచ్చుకైన కనపడవు. క్రీస్తును బట్టి దేవుని మీద ఆధారపడిన జీవితాలు ఏంతో పురోగమనం సాధించే స్థితిలో ఉంటుంటాయి. తమ మానవ జ్ఞానంతో ముడిపెట్టక తమ మంచి చెడ్డల విచక్షణ విషయమైన జ్ఞానం దేవునికే అప్పగించి అన్నింటా దేవునికే మహిమ చెందేలా ఆయన్ను ఘన పరచుటే అతి శ్రేష్టమైన సద్భక్తి జీవిత విధానం. నిత్యజీవము పొందుటకు నేనేం చేయాలి? అన్నదానికి సమాంతర ప్రశ్నయే 'మరణంలో నుండి జీవంలోనికి దాటుట ఎట్లు?' అనేది. మరణంలో నుండి జీవములోనికి దాటుటలో గొప్ప అనుభవం సంపాదించినవాడు, అత్యంత ప్రతిభ, ప్రభావ సంపన్నుడు యేసు మాత్రమే అన్న సర్వసత్యాన్ని బహు తేటగా గ్రహించినవారై మొదటగా ఆయన శిష్యులైన అపొస్తలులు ఆ తదుపరి ఆదిమ సంఘము ఆయన అడుగుజాడలలోనే నడిచి అన్నింటా గెలిచింది. ఆ ఆదిమ సంఘాన్ని అనుసరించి ఒక్కటే క్రీస్తు శరీరమను సంఘాలు నేడునూ పాపం నుండి పరిశుద్ధతలోనికి అనగా మరణంలో నుండి జీవములోనికి విజయవంతంగా దాటుతున్నాయి. అనేకులను దాటించుటలో పేరొందిన గొప్ప సువార్త పరిచర్యను అవి నిరంతరాయంగా చేస్తూ వారివలె ముందుకు కొనసాగిస్తూ విధేయంగా ఎంతో శ్రమిస్తున్నాయి. దేవదేవుడు తనదైన బలాతిశయం చేత యేసును మృతులలో నుండి లేపాడు అన్నదే నేటి పునరుత్థాన దినం. ఇదే క్రైస్తవ నిరీక్షణ జీవితానికి గొప్పదైన పునాది. సమభావపు ఏకత్వం కలిగించే ఒక్కటే నిరీక్షణయందుండుటకు పిలువబడిన వారు ధన్యులు అంటుంది గ్రంథము. "నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్య జీవము గలవాడు. వాడు తీర్పులోనికి రాక 'మరణములో నుండి జీవము లోనికి' దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను"

# ఓటింగ్‌పై గల్ఫ్ దెబ్బ!

## కేరళ పార్టీలకు పశ్చిమాసియా సెగ

## 2.25 లక్షలకు పైగా ప్రవాసీ ఓటర్లు

## వారిలో అత్యధికులు గల్ఫ్ దేశాల్లోన

## 50 అసెంబ్లీ స్థానాల్లో నిర్ణాయక శక్తి

## ఈసారి అత్యధికులు ఓటింగ్‌కు దూరం

## యుద్ధ పరిస్థితులు, విమాన ధరలే కారణం





కేరళలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రవాస ఓటర్లు కీలక పాత్ర పోషిస్తుంటారు. వీరిలో అత్యధికులు గల్ఫ్ దేశాల్లో స్థిరపడ్డవారే. కన్నూర్ మొదలుకుని పాలక్కాడ్ దాకా కనీసం 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రవాసుల ఓట్లు నిర్ణాయకంగా మారుతుంటాయి. దాంతో ఎన్నికల వేళ పార్టీలన్నీ గల్ఫ్ ఓటర్లపై ప్రత్యేకంగా దృష్టి పెడతాయి. వారిని ఓటింగ్‌కు రప్పించేందుకు అన్నిరకాలుగా ప్రయత్నిస్తుంటాయి. కానీ ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గల్ఫ్ దేశాల్లోని మలయాళీలు ఈసారి ఓటేసేందుకు వచ్చే అవకాశాలు పెద్దగా కన్పించడం లేదు. ఇది పార్టీల విజయావకా శాలను గణనీయంగా ప్రభావితం చేయడం ఖాయమని భావిస్తున్నారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. రాష్ట్రంలో ప్రతి ఎన్నికల్లోనూ గల్ఫ్ ఓటర్లది కీలక పాత్రగా ఉంటూ వస్తోంది. ఆ దేశాల్లో 2.25 లక్షల మంది దాకా ఓటర్లున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ వారిలో కనీసం 60 శాతం పైచిలుకు ఓటింగ్ నమోదవడం పరిపాటి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం దెబ్బతో ఈసారి మాత్రం పరిస్థితులన్నీ ప్రతికూలంగా మారిపోయాయి. గల్ఫ్ నుంచి భారత్‌కు విమాన సర్వీసులు బాగా తగ్గిపోయాయి. దీనికి తోడు టికెట్ల ధరలు చుక్కలనంటుతున్నాయి. రూ.8 వేల నుంచి 13 వేలలోపు ఉండే టికెట్లు ఏకంగా రూ.60 వేల దాకా ఎగబాకాయి! పైగా సెలవులు తీసుకుని వస్తే ఉద్యోగం ఊడే పరిస్థితి! దాంతో ఈసారి ఓటింగ్ కోసం వచ్చే మలయాళీల సంఖ్య బాగా తగ్గడం ఖాయంగా కనిపిస్తోంది. 10 శాతం ఓటింగ్ నమోదైనా గొప్పేనని భావిస్తున్నారు!

### మలబార్‌లో కీలకం

ఉత్తర కేరళ ప్రాంతంలో, ముఖ్యంగా మలబార్ ప్రాంతంలో ప్రవాసుల ఓట్లు కీలకంగా మారుతుంటాయి. ఇక్కడ వాటి సంఖ్య చాలా ఎక్కువగా ఉండటమే గాక అతి స్వల్ప మెజారిటీలు నమోదవుతుండటమే ఇందుకు కారణం. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పెరింతల్‌మన్న అసెంబ్లీ స్థానంలో కేవలం 38 ఓట్ల తేడాతో, కుట్టియాడిలో 333 ఓట్ల మెజారిటీతో ఫలితం తేలింది! తనూర్, త్రితల వంటి చోట్ల మెజారిటీ 5,000 ఓట్ల లోపే నమోదైంది. ఇలాంటి స్థానాల్లో ప్రవాసుల ఓట్లు వేలాదిగా ఉండటం విశేషం. కుట్టియాడి అసెంబ్లీ స్థానం పరిధిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 16 వేల పైచిలుకు ప్రవాస ఓటర్లున్నారు!! నాదపురంలో 12,424 మంది, తిరూర్‌లో 8,601, కల్లియసెరిలో 8,097 మంది ప్రవాస ఓటర్లున్నారు. స్వల్ప మెజారిటీలు నమోదయ్యే ఇలాంటి స్థానాల్లో ప్రవాసుల ఓట్లే నిర్ణాయకంగా ఉంటూ వస్తున్నాయి. కానీ ఈసారి వారు భారీ సంఖ్యలో స్వదేశానికి వచ్చి ఓటేసే పరిస్థితులు కన్పించకపోవడంతో పార్టీలు కూడా వారిపై ఆశలు వదులుకుంటున్నాయి. స్థానిక ఓట్లపైనే మరింతగా దృష్టి పెడుతూ గెలుపు వేటలో పడ్డాయి. గల్ఫ్ ఓటర్లపై గట్టి పట్టున్న విపక్ష యూడీఎఫ్ కూటమికి ఇది ఒకరకంగా ఎదురుదెబ్బేనని ఓవర్సీస్ ఇండియన్ కల్చరల్ కాంగ్రెస్ (ఓఐసీసీ) పశ్చిమాసియా కన్వీనర్ కె.టి.ఎ.మునీర్ అభిప్రాయపడ్డారు. "గల్ఫ్ దేశాల్లో స్థిరపడ్డ యూడీఎఫ్ కార్యకర్తల్లో 30 శాతం మంది, మద్దతుదారుల్లో 60 శాతం మంది ఈసారి ఓటింగ్‌కు రాలేకపోవచ్చు. విమాన టికెట్ల ధరలు నాలుగింతలు, అంతకుమించి పెరగడమే ఇందుకు ప్రధాన కారణం" అంటూ ఆయన వాపోయారు. వారు గల్ఫ్ నుంచే ఓటేసేలా ఇ--ఓటింగ్ సదుపాయం అందుబాటులో ఉంటే తమకెంతో కలిసొచ్చేదని అభిప్రాయపడ్డారు.

# యుద్ధంపై రణభేరి!



రాత్రింబగళ్లు నిప్పులు కురుస్తున్నా భూగోళంపైనున్న జనారణ్యాలన్నీ నిశ్చలన చిత్రాలై నిర్లిప్తంగా ఉండిపోతున్నాయన్న నిరాశ సర్వత్రా ఆవరించిన తరుణంలో అమెరికా వ్యాప్తంగా శనివారం ఒక మానవ మహాసముద్రం పోటెత్తింది. దశాబ్దాలనాటి వియత్నాం యుద్ధ వ్యతిరేక ర్యాలీలను తలపిస్తూ, అంతకన్నా మరిన్ని రెట్లు ఎక్కువగా నగరాలు, పట్టణాలు, మారుమూల పల్లెలన్న వ్యత్యాసం లేకుండా-- అమెరికాలోని అన్ని వర్గాలూ ఏకమై 3,300 నిరసన ప్రదర్శనలు నిర్వహించి ముక్తకంఠంతో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధాన్ని ఖండించిన తీరు చరిత్రలో నిలిచిపోతుంది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇంటా, బయటా తన అరాచకంతో ప్రజాస్వామ్యానికీ, మానవతకూ మహాపచారం చేస్తున్నారని ప్రదర్శకులు మండిపడ్డారంటే ఏడాది పాలనలో వారెంత విసిగిపోయారో అర్థమవుతుంది. ఖర్గ్ ద్వీపాన్ని బుగ్గి చేస్తానని, ఇరాన్ ఇంధన క్షేత్రాలకూ, విద్యుదుత్పాదన ప్లాంట్లకూ నిప్పెడతాననీ ట్రంప్ బెదిరిస్తున్న తరుణంలో 'నో కింగ్స్' పేరిట ఇంత పెద్దయెత్తున నిరసనలు ఎగిసిపడటం అసాధారణం. ఉత్తర ధ్రువప్రాంత అలస్కాలో కేవలం 3,000 మంది జనాభా నివసించే కోట్జెబు మొదలుకొని కరేబియన్ ద్వీపంలోని ప్యూర్టోరికో... న్యూయార్క్, వాషింగ్టన్, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో తదితర మహా నగరాల వరకూ ప్రదర్శకులు భారీయెత్తున పాల్గొనగా, యూరప్, లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియాల్లో సైతం 'నో కింగ్స్' ర్యాలీలు జరిగాయి. 'నో కింగ్స్' ఒక్క ట్రంప్ పైన మాత్రమే కాదు... ఆయనకు అపరిమితమైన అధికా రాలు కట్టబెట్టిన, చట్టపరమైన రక్షణలిచ్చిన వ్యవస్థలన్నిటిపైనా మోగించిన రణభేరి. అధికారం అహంకరించినప్పుడూ, న్యాయం సైతం దానితో కుమ్మక్కయినప్పుడూ నడి వీధులే న్యాయస్థానాలవుతాయి. శనివారంనాటి నిరసనల సారాంశం అదే. రాచరిక, భూస్వామ్య వ్యవస్థలపై శతాబ్దాల క్రితం పోరాడి నిర్మించుకున్న ప్రజాస్వామ్యంలో వ్యవస్థలన్నీ కలిసి మరో 'రాజు'ను ప్రతిష్ఠించటానికి పూనుకోవడంపై 'నో కింగ్స్' ఒక తిరుగుబాటు. స్వదేశంలో నియంతగా మారిన పాలకుడు ప్రపంచానికి సైతం శాపంగా పరిణమించే ప్రమాదం ఉన్నదని ట్రంప్ పోకడలు చాటుతున్నాయి. నియంతృత్వం రాజ్యమేలేచోట అరాచకాలు పెరిగినప్పుడు మౌనప్రేక్షకులుగా మిగిలే సాధారణ జనంలో సైతం ఆలోచనలు రేకెత్తించడానికీ, కార్యోన్ముఖుల్ని చేయటానికీ ఈ నిరసనలు పుట్టు కొస్తాయి. రిపబ్లికన్‌ల ఆధిక్యతగల రాష్ట్రాలూ, 'మాగా' ఉద్యమ ప్రాబల్యంగల ప్రాంతాలూ సైతం ఈసారి నిరసనలతో హోరెత్తటం గమనించదగ్గది. జనహననం కోసం పశ్చిమాసియాకు ట్రంప్ తరలించిన మెరైన్ల తల్లులు కూడా ఇందులో పాల్గొన్నారు. నెలక్రితంతో పోలిస్తే... వారం రోజులుగా ఇరాన్ ప్రతిదాడుల సంఖ్య తగ్గిందనీ, రోజుకు 30 మించటం లేదనీ అంటున్నారు.


కానీ అవి నేరుగా లక్ష్యాన్ని గురి చూస్తున్నాయి. వ్యూహాత్మక ప్రాంతాల్లో ఇరాన్ ప్రయోగించిన క్షిపణిని ప్రత్యర్థి పక్షాలు నిలువరిస్తున్నా అది కిందపడుతూ పదుల బాంబులై పేలటం, జననష్టంతోపాటు ఆస్తి నష్టం తీసుకురావటం కనబడుతూనే ఉంది. ఎదురుదాడుల క్రమంలోనే అంచనాలు పదు నెక్కించుకుని, నిఘా కార్యకలాపాలను సమన్వయపరుచుకుని ఇరాన్ దళాలు వ్యవహ రిస్తున్నాయని ఇది తేటతెల్లం చేస్తోంది. గల్ఫ్ దేశాల్లో, ఇజ్రాయెల్‌లో లక్షలాదిమంది పౌరులు ఇప్పటికీ బాంబు షెల్టర్లలో తలదాచుకొనక తప్పని స్థితి ఉంది. ప్రత్యర్థి పక్షాల ప్రాంతాల్లో ఒకసారంటూ అస్థిర పరిస్థితుల్నీ, అభద్రతా భావాన్నీ తీసుకొచ్చాక దాడుల సంఖ్య గణించదగ్గది కాదు. గత జూన్‌లో 12 రోజుల అమెరికా, ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్ విశ్రమించలేదని తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఈ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజల జీవితాలనూ అస్తవ్యస్తం చేస్తోంది. వారి జీవికను దెబ్బతీస్తోంది. ఇరాన్‌పై యుద్ధం ఆపకుండా, హోర్మూజ్ జలసంధి మాత్రం ప్రశాంతంగా ఉండాలనీ, ఇంధన రవాణా నిరాటంకంగా జరగాలనీ ట్రంప్ కోరుకోవటం దురాశ. ఇంధన ధరలు మిన్నంటితే తన కొలువుకు ఎసరొస్తుందన్న ఏకైక భయంతోనే పశ్చిమాసియాలో ప్రస్తుతం ఆయన వేలాదిమంది మెరైన్లను మోహరించారు. అమెరికా ప్రజల అభీష్టమేమిటో తెలిసింది గనుక ఇకనైనా ట్రంప్ తన దుష్ట పోకడలకు స్వస్తి చెప్పాలి.




# ఒకే స్క్రీన్‌పై మమ్ముట్టి, మోహన్‌లాల్

## గూస్‌బంప్స్ తెప్పిస్తున్న 'పేట్రియాట్' ట్రైలర్!

మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం 'పేట్రియాట్' ఇద్దరు లెజెండరీ నటులు, మలయాళ సూపర్ స్టార్స్ అయిన మమ్ముట్టి మరియు మోహన్‌లాల్ చాలా ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. బ్రిలియంట్ డైరెక్టర్ మహేష్ నారాయణన్ దర్శకత్వంలో, ప్రముఖ నిర్మాత ఆంటో జోసెఫ్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ట్రైలర్‌ను గమనిస్తే, ఇది ఒక హై-వోల్టేజ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా లేదా దేశభక్తి నేపథ్యంలో సాగే గ్రిప్పింగ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందినట్లు స్పష్టమవుతోంది. ట్రైలర్‌లో మమ్ముట్టి మరియు మోహన్‌లాల్ ఇద్దరి స్క్రీన్ ప్రెజెన్స్, వారి పవర్‌ఫుల్ డైలాగ్స్ మరియు క్యారెక్టరైజేషన్స్ అభిమానులకు పూనకాలు తెప్పించేలా ఉన్నాయి. మహేష్ నారాయణన్ టేకింగ్, అత్యున్నత ప్రమాణాలతో కూడిన విజువల్స్ మరియు వెన్నులో వణుకు పుట్టించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో మలయాళ ఇండస్ట్రీలోనే కాకుండా తెలుగు, తమిళ, హిందీ చిత్ర పరిశ్రమల్లో కూడా ఈ సినిమా హాట్ టాపిక్‌గా మారింది. ఈ ట్రైలర్ చూసిన సినీ ప్రియులు, ఇద్దరు మహానటుల నటనను వెండితెరపై చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# ప్రభాస్ కార్ కలెక్షన్ చూస్తే మతిపోవాల్సిందే.

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. ప్రస్తుతం రాజాసాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తోన్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో డార్లింగ్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్ ఆకట్టుకుంటున్నాయి. హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ మూవీలో ప్రభాస్ సరికొత్త పాత్రలో కనిపిస్తుండడంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని తెగ వెయిట్ చేస్తున్నారు ఫ్యాన్స్. త్వరలోనే ఈ సినిమా అడియన్స్ ముందుకు రానుంది. అలాగే తన కొత్త ప్రాజెక్ట్స్ పై ఫోకస్ పెట్టాడు డార్లింగ్. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ప్రభాస్ లైఫ్ స్టైల్, కార్ కలెక్షన్, రెమ్యునరేషన్ గురించి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. ప్రభాస్ ప్రస్తుతం ఒక్కో సినిమాకు రూ.100 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటున్నాడు. నివేదికల ప్రకారం డార్లింగ్ ఆస్తి రూ.240 కోట్లకు పైగా ఉంటుందట. ఇక ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌కు దాదాపు రూ.2 కోట్లు తీసుకుంటాడని సమాచారం. అంతేకాకుండా ప్రభాస్ వద్ద కార్ కలెక్షన్ చూస్తే దిమ్మతిరిగిపోద్ది. ప్రస్తుతం డార్లింగ్ వద్ద రోల్స్ రాయిస్ ఫాంటమ్ కారు ఉంది. ఈ కారు విలువ రూ.8 కోట్లు. ఇండస్ట్రీలో అక్షయ్ కుమార్, షారుఖ్ ఖాన్, అమితాబ్ బచ్చన్ వద్ద మాత్రమే ఈ కారు ఉందట. అలాగే డార్లింగ్ దగ్గర రూ.2.08 కోట్ల విలువైన జాగ్వార్ కారు సైతం ఉంది. అలాగే రూ.1 కోటి విలువైన రేంజ్ రోవర్ స్పోర్ట్స్ కారుతోపాటు.. డార్లింగ్ గ్యారేజీలో లాంబోర్గినీ అవెంటడోర్ రోడ్ స్టర్ కారు ఉంది. దీని విలువ రూ.6 కోట్లు ఉంటుంది. అలాగే రూ.68 లక్షల విలువైన %దీవీఔ శ%3 ఉన్నాయి. ప్రస్తుతం రాజాసాబ్ సినిమాతోపాటు డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్షన్ లో ఒక సినిమా.. సలార్ 2 చిత్రాల్లో నటిస్తున్నాడు డార్లింగ్.

# ఆ హీరోతో నటించడం ఎంతో అదృష్టం : మాళవిక


తమిళంలో అగ్ర హీరోల సరసన నటించి ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటిం గ్ సందర్భంగా ప్రభాస్ మంచితనం, సహృదయతకు తాను ఫిదా అయిపోయానని, ముఖ్యంగా ఆయన ఇంటి నుంచి తీసుకొచ్చే ఫుడ్ అద్భుతమని గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్‌ను పొగడ్తల్లో ముంచెత్తిందీ భామ. తాజాగా మరోసారి ప్రభాస్ గురించి మాట్లాడింది. ప్రభాస్ వంటి గ్రేట్ పర్సన్‌తో నటించడం తన అదృష్టమని, తన కెరీర్‌లోనే మైలురాయిలా నిలిచే చిత్రమవుతుందని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. 'నిజంగా ఈ సినిమా ఛాన్స్ రావడం లక్కీగా ఫీలవుతున్నా. షూటింగ్ అంతా సరదాగా సాగిపోతున్నది. ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి మించిన ఆనందం ఏముంటుంది? ఈ సినిమాను జీవితాంతం గుర్తుంచుకుంటా' అని ఆనందం వ్యక్తం చేసింది మాళవిక మోహనన్. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన 'రాజా సాబ్' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.



# కింగ్‌ఖాన్ హాలీవుడ్ ఎంట్రీ?

## 'ది వైట్ లోటస్' వెబ్ సిరీస్‌లో షారూఖ్.!

ప్రముఖ హాలీవుడ్ వెబ్ సిరీస్ 'ది వైట్ లోటస్' మూడో సీజన్ గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ ఈ క్రేజీ సిరీస్‌లో నటించబోతున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. హెచ్‌బీఓ ఛానెల్‌లో అత్యంత పాపులర్ అయిన డార్క్ కామెడీ డ్రామా సిరీస్ 'ది వైట్ లోటస్'. దీని మూడో సీజన్ చిత్రీకరణ థాయ్‌లాండ్‌లో జరుగుతోంది. అయితే, ఈ సిరీస్ నుంచి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోనే తప్పుకుందనే వార్తలు వచ్చిన కొద్ది రోజులకే.. ఆ స్థానంలోకి షారూఖ్ ఖాన్ రాబోతున్నారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. షారూఖ్ ఖాన్ ప్రస్తుతం తన సొంత భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడని. హాలీవుడ్ షోలలో నటించే ఆలోచన ఆయనకు ప్రస్తుతానికి లేదని వెల్లడించినట్లు తెలుస్తుంది. మరోవైపు 'ది వైట్ లోటస్' టీమ్ గానీ, షారూఖ్ మేనేజ్‌మెంట్ గానీ ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.



# మత్తు కళ్లలో మతిపోగొడుతున్న శ్రీయరెడ్డి

శ్రియ రెడ్డి.. టెలివిజన్ ప్రెజెంటర్, వీడియో జాకీ గా చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ అమ్మడు ఎక్కువగా తమిళం, తెలుగు సినిమాల్లో నటించింది. అంతే కాదు మాజీ భారత టెస్ట్ క్రికెటర్ భరత్ రెడ్డి కుమార్తె ఆమె . శ్రియ తన నటనా జీవితాన్ని ప్రారంభించే వీడియో జాకీగా పనిచేసింది. ఈ బ్యూటీ 2002లో "సమురాయ్" అనే తమిళ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగు, మలయాళ చిత్రాల్లో సుమారు డజను సినిమాల్లో నటించింది. "బ్లాక్" , "తిమిరు", "కంచివరం", "సలార్: పార్ట్ 1 సీజ్‌ఫైర్" లాంటి సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక తెలుగులో ఈ భామ మొదటి చిత్రం "అప్పుడప్పుడు". ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆతర్వాత "బ్లాక్" చిత్రంలో మమ్ముట్టితో కలిసి నటించడం ద్వారా మలయాళంలో మంచి గుర్తింపు పొందింది. శ్రియ 2008లో నటుడు మరియు నిర్మాత విక్రమ్ కృష్ణను వివాహం చేసుకుంది. విక్రమ్ కృష్ణ ప్రముఖ నిర్మాత రెడ్డి కుమారుడు. అలాగే నటుడు విశాల్ కృష్ణ సోదరుడు. వివాహం తర్వాత ఆమె తన భర్తతో కలిసి సినిమా నిర్మాణంలోకి కూడా అడుగుపెట్టింది. ఇటీవల "సలార్" చిత్రంలో రాధా రామ పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఆమె తదుపరి పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో కూడా కనిపించనుంది. తాజాగా సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు షేర్ చేసింది



# క్రేజీ ఫొటోలను షేర్ చేసిన షాలిని



షాలిని పాండే తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ బ్యూటీ 1993 సెప్టెంబర్ 23న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించింది. జబల్‌పూర్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన షాలిని, చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చింది. ఇంజనీరింగ్ చదువుతున్న రెండవ సంవత్సరం నుంచే ఆమె నాటకాల్లో నటించడం ప్రారంభించింది. షాలిని పాండే 2017లో విజయ్ దేవరకొండ నటించిన తెలుగు చిత్రం అర్జున్ రెడ్డి ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఈ చిత్రంలో ఆమె ప్రీతి అనే పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా భారీ విజయం సాధించడంతో షాలినికి విశేష గుర్తింపు లభించింది. తెలుగు మాట్లాడడం రానప్పటికీ, ఈ చిత్రంలో తన పాత్రకు ఆమె స్వయంగా డబ్బింగ్ చెప్పుకుంది. అర్జున్ రెడ్డి తర్వాత షాలిని తెలుగులో మహానటి, 118, ఇద్దరి లోకం ఒకటే, నిశ్శబ్దం వంటి చిత్రాల్లో నటించింది. ఆమె తమిళ సినిమా 100% కాదల్ లో కూడా కనిపించింది. హిందీలో జయేష్‌భాయ్ జోర్దార్, మహారాజ్ చిత్రాలతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. మహారాజ్ చిత్రంలో ఆమె నటన, ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే షాలిని. రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com